

వార్త
ఆదివారం
16 ఫిబ్రవరి, 2025

# కృత్రిమ మేధకు కొత్త రెక్కలు..



# తారాతీరం

## త్వరలో 'జైలర్ 2'

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన మాస్ యాక్షన్ ఎమోషనల్ ఎంటర్టైనర 'జైలర్' అద్భుత విజయం సాధించింది. ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు కొనసాగింపుగా 'జైలర్ 2' రాబోతున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ సీక్వెల్ షూటింగ్‌పై లేటెస్ట్ అప్ డేట్ వినిపిస్తోంది. మార్చి రెండో వారం నుంచి ఓ యాక్షన్ సీక్వెన్స్‌తో షూట్ ఈ సినిమా మొదలు పెట్టనున్నారు. ఈ సీక్వెన్స్‌లో రజనీకాంత్‌తో పాటు మిగిలిన నటీ నటులు కూడా షూటింగ్‌లో జాయిన్ అవుతారట. ఇక ఈ 'జైలర్ 2'లో రజనీని తొలి భాగం కన్నా మరింత స్టైలిష్‌గా చూపించనున్నారని, అలాగే రజని లుక్ విషయంలో కూడా నెల్సన్ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నాడని తెలుస్తోంది. 'జైలర్ 2'లో కూడా తమన్నా, యోగిబాబు, వినాయకన్, రమ్యకృష్ణ మొదలైనవారు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా నిర్మించబోతున్నారు. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' సినిమాతో బిజీగా ఉన్నారు. 'టైగర్ కా హుకూమ్' అంటూ 'జైలర్'లో హంగామా చేసిన రజనీకాంత్, 'జైలర్ 2'లో ఎలాంటి హంగామా చేస్తారో చూడాలి.

## నానితో రాక్‌స్టార్ అనిరుధ్?

నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన చివరి చిత్రం "సరిపోదా శనివారం"తో సాలిడ్ హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రం తర్వాత నాని "హిట్ 3" అలాగే దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో "ది ప్యారడైజ్" చిత్రాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్నాడు. లేటెస్ట్‌గా "ప్యారడైజ్" కోసం నాని బీస్ట్ లుక్‌లోకి కూడా సిద్ధం అయినట్లు సమాచారం. కోలీవుడ్ రాక్ స్టార్ అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నట్టు ఎలుస్తోంది. దీనితో నానితో అనిరుధ్ "జెర్సీ", "గ్యాంగ్ లీడర్" తర్వాత ముచ్చటగా ఇది మూడో సినిమా అని చెప్పొచ్చు. మరి ఈ సినిమా సబ్జెక్టు కూడా నెక్స్ట్ లెవెల్లో ప్లాన్ చేయగా– అనిరుధ్ దీనికి అదనపు ఆకర్షణ అని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రాన్ని ఎస్ ఎల్ వి సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.



ఆదివారం వార్త

16 ఫిబ్రవరి, 2025

## మంచి ముత్యాలు

విషాదంలో విశాల విశ్వం ఇరుకుగా ఉంటుంది;
ఆనందంలో అదే విశ్వం విశాలంగా ఉంటుంది. - దాశరథి

అన్ని పుస్తకాలను ఒకేసారి చదవాలని ప్రయత్నించే వ్యక్తి ఈగల్లాగా గెంతవలసిందే. - శామ్యూల్ రోగర్స్

## కదంబం


'సంఘీ'భావం....5

లికవరీ కాని సైబర్ నేరాల సొమ్ము

కవర్ స్టోరీ..6

కృత్రిమ మేధకు కొత్త రెక్కలు..

తెలుగులో తిట్లు...11

ఈ వారం కవిత్వం...12

వసంతం

సాహిత్యం..14

'తురంగ వృత్త'మే ముత్యాల సరం!

రైజింగ్ స్టార్ .. 18

కథ..20

అమెరికా యోగం

నమహాకుండలినీ క్షేత్రం.... 26

అద్భుతమైన జలపాతాలు.. 28

ఇంకా...

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


# తాజా వార్తలు

## అన్నదాతల బడి

అలకెరె అనే గ్రామం కర్ణాటకలోకి మాండ్య జిల్లాలో ఉంది. ఇంతకు ఈ గ్రామం ప్రత్యేకతే ఏమిటంటే- పిల్లలు ప్రతిరోజూ స్కూలుకి వెళ్లినట్లుగా ఇక్కడి రైతులు ప్రతిరోజూ స్కూలుకు వెళతారు. అక్కడ చెప్పే విషయాలను శ్రద్ధగా ఆలకిస్తారు. అవసరమైన విషయాలు రాసుకుంటారు. అక్కడ చూపించే వీడియోలను ఎంతో ఆసక్తిగా చూస్తారు. అంతేకాదు.. అప్పుడప్పుడూ ఫీల్డు ట్రిప్పులకు సైతం వెళ్తుంటారు.

రైతులకు కోసం బడి ఎందుకు పెట్టారంటే.. ఒకప్పుడు తీవ్రమైన కరువును ఏర్పడిన సమయంలో చాలామంది రైతులు వలస కూలీలుగా మారారట. కొవిడ్ సమయంలో సొంత గ్రామానికి తిరిగి వచ్చి కొంత మంది అప్పుల బాధలు భరించలేక ఆత్మహ్యాతలు చేసుకున్నారట. దాంతో కొందరు అధ్యాపకులు అక్కడ పరిస్థితుల్లో మార్పులు తీసుకురావాలని సుమారు ఐదు వందల గ్రామాల్లో అధ్యయనం చేసారు. ఈ క్రమంలో రైతులను అప్‌డేట్ చేసి, ఆధునిక సాగు మెళకువలను తెలియచేయాల్సిన అవసరం వుందని అర్థం చేసుకున్నారు. అందువల్ల ఫార్మర్స్ స్కూల్‌ను ప్రారంభించి విదేశాల్లోని సాగు పద్ధతులు, రైతుల విజయగాథలు, విత్తనాలను భద్రపరిచే పద్ధతులు మొదలైనవి రైతులకు తెలియచేస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో పొలాల్లోనే పాఠాలు చెప్పిస్తున్నారు. అంతేనా... ఈ బడికి వెళ్లే రైతులకు లెక్చరర్ల బృందం స్టైఫండ్ కూడా ఇస్తోందట. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి వసతి సౌకర్యం కల్పించడం మరో విశేషం.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com





# పండ్లే చిత్రాలైతే..





చేతులు
అద్భుతాలు చేస్తే ఇలా..
పండ్లూ, కూరగాయలే
చిత్రాలవుతాయి. మనసుకు రెక్కలొచ్చి
ఎక్కడికో వెళ్లిపోతుంది. కళ్లు
ఆశ్చర్యానందాలతో రెట్టింపు అవుతాయి.
ఇలాంటి రకరకాల భావాలు ఒకేసారి
కలగడానికి కారణం. జపనీస్ కళాకారిణి
టొమోకో సాటో చేతి నుంచి జాలువారిన
చిత్రాలు. ఫ్రూట్ కార్వింగ్ కనువిందు
చేస్తుందని తెలుసుగానీ.. మరీ ఇంత
అందంగా, అపురూపంగా
ఉంటుందంటే ఇంకా నమ్మబుద్ది
కావడం లేదు కదూ!









## 'సంఘీ' భావం



# రికవరీ కాని సైబర్ నేరాల సొమ్ము

తెలిసో తెలియకో సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు కోల్పోయిన బాధితులకు పోలీసులను ఆశ్రయించినా ఉపశమనం కలగడం లేదు. సైబర్‌నేరగాళ్లు ఎప్పటికప్పుడు తమ పంథాను మార్చుకోవడంతో వారిని పట్టుకోవడమే కష్టతరంగా ఉంది. ఇక రికవరీ విషయంలో అనేక చట్టపరమైన సమస్యలు ఎదురౌతున్నాయి. పోలీసుల నుంచి, చట్టనిబంధనల నుంచి తప్పించుకోవడానికి అనేక మార్గాలను సిద్ధంగా ఉంచుకుంటున్నారు. సాధారణంగా సైబర్‌నేరగాళ్లు తాము నేరం చేసే ప్రాంతానికి దూరంగా ఉంటారు. పొరుగు రాష్ట్రాల్లో ఉండటం, విదేశాల్లో మకాం వేయడం వంటి జాగ్రత్తలు తీసుకుని వారు నేరాలు చేస్తుంటారు. ప్రస్తుతం అంతర్ రాష్ట్రాల మధ్య పోలీసులు సమన్వయం కుదుర్చుకున్నారు. నేరగాళ్లను పట్టుకోవడానికి ఒక రాష్ట్రం పోలీసులతో మరో రాష్ట్రం పోలీసులు పూర్తి స్థాయిలో సహకారాన్ని అందిస్తున్నారు. దీనితో కొన్ని సందర్భాల్లో సైబర్‌నేరగాళ్లను పట్టుకోవడం సులభతరం అవుతోంది. అయితే వీరు ఒక రాష్ట్రంలోనే మకాం వేయకుండా సంచారం చేస్తూ ఉంటారు. ఈ సమయంలో వారిని పట్టుకోవడం సమస్యగా ఉంటోంది. సెల్‌ఫోన్ జిపిఎస్ సహకారంతో నేరగాళ్లను పట్టుకునే అవకాశం కలుగుతుంది. ఇక భారీ మొత్తంలో నగదు చేతులు మారినప్పుడు అందులో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు అందింతే ఆయా బ్యాంకుల ఖాతాలను లావాదేవీలు జరకుండా నిలిపివేసే అధికారం పోలీసులకు ఉంటుంది. అయితే సైబర్ నేరగాళ్లు ఇక్కడ కూడా తెలివిగా తప్పించుకుంటున్నారు. సైబర్ నేరగాళ్ల వివరాలు తెలుసుకుని బ్యాంకు ఖాతాలు స్థంభింపచేసే లోగానే ఆయా బ్యాంకుల్లో నగదును వేరే ఖాతాలకు తరలిస్తున్నారు. కొందరు నిరుపేదలకు ఆశలు కల్పించి వారి బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లు ఉపయోగించుకుంటున్నారు. తాము వ్యాపా రాలు చేస్తున్నామని, పన్నులు తప్పించుకోవడానికి కొన్ని రోజులు వారి ఖాతాను ఉపయోగించుకునే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. దీనికి ప్రతిఫలంగా కొంత సొమ్ము ఇస్తామని ఆశలు పెట్టడంతో వారు బ్యాంకు ఖాతాలను ఉపయోగించుకునే అవకాశాన్ని సైబర్ నేరగాళ్లకు ఇస్తున్నారు. ఈ విధంగా వంద నుంచి 150 ఖాతాలు తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నారు. ఒకసారి ఖాతాలో పెద్ద మొత్తం పడిన వెంటనే అక్కడి నుంచి వేర్వేరు బ్యాంకులకు ఈ మొత్తాన్ని నాలుగు అయిదు విడతలుగా బదిలీ చేస్తున్నారు. నగదు విషయంలో మోసపోతే ఆ సొమ్ము ఎక్కడికి వెళ్లిందని పోలీసులు ఆరా తీస్తారు. ఉదా. రెండు లక్షల రూపాయల మోసం జరిగిందని భావిస్తే ఆ ఖాతును వెంటనే మూసివేయాలని బ్యాంకు అధికారులకు ఆదేశాలు ఇస్తారు. అప్పటికే నేరగాళ్లు ఆ మొత్తాన్ని 50 వేల రూపాయలుగా నాలుగు భాగాలు చేసి వేర్వేరు బ్యాంకులకు బదిలీ చేస్తారు. పోలీసులు బ్యాంకు అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు న్యాయస్థానంలో కూడా పిటిషన్ వేస్తారు. బ్యాంకు అధికారులకు నోటీసులకు ఇచ్చిన వెంటనే వారు స్పందించడం లేదు. ఇక్కడ బ్యాంకు అధికారులు వారం నుంచి పది రోజుల వరకు సమయం తీసుకుంటున్నారు. ఈలోగా ఖాతాలో సొమ్మును వేరే బ్యాంకుకు తరలిస్తున్నారు. విషయం తెలిసి పోలీసులు ఆ బ్యాంకుకు నోటీసులు ఇస్తే మళ్లీ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. ముందుగా కోర్టులో అనుమతి తీసుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఇలా కాలయాపన కొనసాగుతూ ఉండటంతో సైబర్ నేరగాళ్లు తప్పించుకోవడం సులభంగా ఉంటోంది. ఒకవేళ బ్యాంకును గుర్తించి ఖాతాను సీజ్ చేస్తే కోర్టులో ఇది నేరం జరిగిన లావాదేవీకు సంబంధించిన మొత్తం అని పోలీసులు నిరూపించాల్సి ఉంటుంది, అయితే నేరం జరిగిన సొమ్ము 2 లక్షలుగా ఉంటే బ్యాంకులో కేవలం 50 వేలు మాత్రమే జమ అయినట్లు రికార్డుల్లో చూపిస్తుంది. రెండు లక్షలను నాలుగు బ్యాంకుల్లో వేయడం వల్ల ఈ సమస్య వస్తుంది. నేరం జరిగింది రెండు లక్షలు అయితే ఖాతాలో జమ అయిన సొత్తు కేవలం 50 వేలు మాత్రమే ఉండటంతో కోర్టులో పోలీసుల సాక్ష్యం నిలబడటం లేదు. ఇక జమ అయిన బ్యాంకు ఖాతాదారుని వివరాలు సేకరించి అతనిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తే అతనికి ఈ నేరంతో ఎలాంటి సంబంధం లేదని తెలుస్తోంది. వెయ్యి రెండు వేలకు ఆశపడి తమ ఖాతాను గుర్తు తెలియని వేరొకరికి అప్పగించారని దర్యాప్తులో వెల్లడి అవుతోంది. దీనితో ఇలాంటి కేసుల్లో దర్యాప్తు ఇబ్బందికరంగా మారుతోంది. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త విధాలను ఆశ్రయిస్తున్నారు. సైబర్ నేరం జరిగిన తరువాత పోలీసులను ఆశ్రయించడం కంటే బాధితులు కొంత ముందు జాగ్రత్తతో వ్యవహరించాలని పోలీసులు కోరుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. టికెట్ కొనకపోయినా లాటరీ తగిలిందని చెప్పి ముందుగా కొంత సొమ్మును జమ చేయాలని సైబర్‌నేరగాళ్లు సామాన్యులకు గాలం వేస్తుంటారు,

ఇలాంటి వాటికి లొంగకుండా వాస్తవాలు గ్రహించాలని పోలీసులు ప్రజలను కోరుతున్నారు. ఇలాంటి ఫోన్‌కాల్స్, సందేశాలు వచ్చినప్పుడు డబ్బు పంపకుండా పోలీసులను ఆశ్రయించడం ద్వారా నేరగాళ్ల మోసాలను అరికట్టే అవకాశం ఉంటుందని ప్రజలు తెలుసుకోవాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# కృత్రిమ మేధకు కొత్త రెక్కలు..



**కవర్ స్టోరీ**

కింజరాపు అమరావతి

**27 జనవరి 2025 నాడు అమెరికా స్టాక్ మార్కెట్లు అల్లకల్లోలం అయిపోయాయి! ప్రధాన గ్లోబల్ టెక్నాలజీ కంపెనీల షేర్లు పడిపోయాయి! బ్రాడ్కామ్, ఎన్విడియా స్టాక్స్ 17 నుండి 18 వరకు నష్టాలు చవిచూశాయి! డచ్ చిప్ పరికరాల తయారీ సంస్థ ఏఎస్ఎంఎల్ 7 శాతానికి పైగా పడిపోయింది! మరెన్నో ఇతర టెక్ సంస్థల మార్కెట్ క్షీణించాయి! కంప్యూటర్ హార్డ్ వేర్ కంపెనీల మార్కెట్ కేపిటలైజేషన్లలో 593 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది! నాస్‌డాక్‌లో టెక్నాలజీ స్టాక్స్ ప్రపంచవ్యాప్తంగా అమ్ముడు పోయాయి! 28 జనవరి 2025 నాటికి మొత్తం లక్ష కోట్ల విలువ గల అమెరికన్ స్టాక్స్ నుండి తుడిచిపెట్టుకుపోయింది! కారణం? దీనంతటికీ సమాధానం ఒక్కటే ! అదే డీప్ సీక్. ముందుగా 'డీప్ సీక్' గురించి తెలుసుకోవాలి. అంతకన్నా ముందు దీని వెనుక ఉండే కృత్రిమ మేధ (ఎఐ) గురించి తెలుసుకోవాల్సిందే.**

మానవ మేధస్సును పరిణామ క్రమం, సాంస్కృతిక అభివృద్ధి, సాంకేతిక పురోగతితో అనుసంధానించవచ్చు.

## సాంస్కృతిక పరిణామంలో

భాష లిపి అనంతర ఆవిష్కరణలన్నీ మానవులకు సమాచారాన్ని పంచుకోవడం, సంక్లిష్ట ఆలోచనలను వ్యక్తపరచడం సాధ్యపరిచింది. రాత, గణితం, ఖగోళ శాస్త్రం వంటి విజ్ఞాన రంగాల అభివృద్ధి మానవ మేధస్సు పరిణామాన్ని తెలియజేస్తుంది. సమాచార వ్యాప్తిని వేగవంతం చేసింది. ఆధునిక యుగంలో పారిశ్రామిక విప్లవం, సాంకేతిక పురోగతి అభివృద్ధి, మానవ మేధస్సుతోనే సాధ్యమైంది. కంప్యూటర్, ఇంటర్నెట్ ఆవిష్కరణలు సమాచార యుగాన్ని మరో అడుగు ముందుకు వేయడంలో తోడ్పడింది. కృత్రిమ మేధస్సు చరిత్ర 1950లలో ఎఐ ఆలోచన మొదటిసారిగా అలాన్ ట్యూరింగ్ వంటి వారు ప్రతిపాదించారు. "ట్యూరింగ్ టెస్ట్" అనేది యంత్రాలు మానవుల వలె ఆలోచించగలవా?, అని పరీక్షించడానికి ఒక పద్ధతిగా ప్రతిపాదించబడింది. 1956లో "డార్ట్మౌత్ కాన్ఫరెన్స్" ఎఐ అధికారిక ప్రారంభంగా పరిగణిస్తుంటాం. ఇది ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్థాపన సంఘటనగా విస్తృతపరిచింది. ఈ ప్రాజెక్ట్ నలుగురు నిర్వాహకులు క్లాడ్ షానన్, జాన్ మెక్‌కార్తీ, నథానియల్ రోచెస్టర్, మార్విన్ మిన్స్కీలను ఎఐ వ్యవస్థాపక పితామహులలో కొందరుగా చెప్పవచ్చు. క్లాడ్ ఎల్వుడ్ షానన్ ఒక అమెరికన్ గణిత శాస్త్రజ్ఞుడు, ఎలక్ట్రికల్ ఇంజనీర్, కంప్యూటర్ శాస్త్రవేత్త, "సమాచార యుగం పితామహుడు" అని పిలుస్తారు. అన్నీ డిజిటల్ ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌లకు అవసరమైన బూలియన్‌గేట్‌లను (ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌లు) వివరించిన మొదటి వ్యక్తి షానన్. సమాచార యుగానికి పునాదులు వేసిన ఘనత షానన్‌కు దక్కుతుంది. ఈ సమావేశంలో ఎఐ పరిశోధన ప్రాథమిక లక్ష్యాలు, సాధ్యా సాధ్యాలను చర్చించారు. 21వ శతాబ్దంలో ఎఐ పరిశోధన లో విప్లవాత్మక మార్పులు సంభవించాయి. డీప్ లెర్నింగ్, న్యూరల్ నెట్వర్క్స్, బిగ్ డేటా వంటి సాంకేతికతలు ఎఐ పురోగతిని వేగవంతం చేశాయి.

## కృత్రిమ మేధస్సు అంటే?

కృత్రిమ మేధస్సు (ఎఐ) అనేది మాట్లాడే, రాతపూర్వక భాషను చూడటం, అర్థం చేసుకోవడం, అనువదించడం, సమాచారాన్ని విశ్లేషించడం, సిఫార్సులతో పాటుగా మరెన్నో అధునాతన విధులను నిర్వహించడానికి కంప్యూటర్లను అనుమతించే సాంకేతికతల సమూహం.

ఇది మానవులు విశ్లేషించగల దానికంటే ఎక్కువ స్థాయిని కలిగి ఉంటుంది. కృత్రిమ మేధస్సు మానవ మేధస్సును అనుకరించే యంత్రాల రూపకల్పన, అభివృద్ధి చేయడాన్ని సూచిస్తుంది. ఇది యంత్రాల చేత ప్రదర్శించబడే మేధస్సు. మానవులు, జంతువులలో కనిపించే మేధస్సుకు విరుద్ధమైంది. ఇది ఒక్కోసారి సహజ మేధస్సుని పోలి వుండవచ్చు, ఉండక పోవచ్చు. విషయాలపై అవగాహన సమస్యలకు పరిష్కారం, కనుక్కోవటం లాంటివి మానవ లక్షణాలు. ఇటువంటి లక్షణా లను యంత్రాలు ప్రదర్శించగలిగితే వాటికి 'కృత్రిమ మేధస్సు'గా పరిగణిస్తాం. ఇది కంప్యూటర్ సైన్స్, డేటా అనలిటిక్స్, స్టాటిస్టిక్స్, హార్డ్వేర్ అండ్ సాఫ్ట్వేర్ ఇంజినీరింగ్, లింగ్విస్టిక్స్, న్యూరోసైన్స్, ఫిలాసఫీ, సైకాలజీతో సహా అనేక విభిన్న విభాగాలను కలిగి ఉన్న విస్తృత రంగం.

## ఎఐ ఎలా పనిచేస్తుంది?

విభిన్న ఎఐ సాంకేతికతలలో ప్రత్యేకతలు మారుతున్నా కృత్రిమ మేధ వ్యవస్థలు విస్తారమైన సమాచారాన్ని బహిర్గతం ద్వారా నేర్చుకుంటాయి, మెరుగుపడతాయి. ఈ అభ్యాస ప్రక్రియలో తరచుగా అల్గారిథమ్‌ని ఉపయోగిస్తాయి. కృత్రిమ మేధలో భాగమైన ప్రసిద్ధ మెషిన్ లెర్నింగ్లో అల్గోరిథమ్ని అంచనాలు వేయడానికి లేదా సమాచారాన్ని వర్గీకరించడానికి లేబుల్

ఎఐ వ్యవస్థ సమాచారం, అనుభవాల నుండి నేర్చుకుని, స్వయంగా మెరుగుపడతాయి. 1955లో కృత్రిమ మేధస్సు ఒక విద్యా విభాగంగా స్థాపించబడినా ఆ తరువాత అత్యంత తెలివి, విజ్ఞానం, సామర్థ్యం కల యంత్రాలు అందుబాటులోకి వస్తాయనే ఆశల్ని రేకెత్తించాయి. అప్పటికి అందుబాట్లో ఉన్న వనరులు ఈ ఆశలను, అంచనాలను అందుకోవడానికి సరిపోలేదు. కొంత విరామ కాల వ్యవధి ('ఎఐ వింటర్') ఆ తరువాత కొత్త విధానాలు, విజయాలు, నిధులు కృత్రిమ మేధకు సంబంధించిన పరిశోధనలను పునరుద్ధరించాయి. ఇరవై ఒకటవ శతాబ్దంలో, కంప్యూటర్ శక్తి, పెద్ద మొత్తంలో డేటా లభ్యం కావడం, సైద్ధాంతిక అవగాహనలో పురోగతి తరువాత కృత్రిమ మేధ పరిశోధనలు తిరిగి పుంజుకున్నాయి. కృత్రిమ మేధ టెక్నాలజీ పరిశ్రమలో ఒక ముఖ్యమైన భాగంగా మారింది, కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కార్యకలాపాల పరిశోధనలలో అనేక సవాలు సమస్యలను పరిష్కరించడంలో సహాయపడింది.




## కృత్రిమ మేధస్సు రకాలు

కృత్రిమ మేధస్సు అభివృద్ధి దశలు, చేయబడుతున్న చర్యలను బట్టి ఎఐ అభివృద్ధి నాలుగు దశలుగా వర్గీకరించవచ్చు. అవి:

**1. రియాక్టివ్ యంత్రాలు:** ముందస్తుగా ప్రోగ్రామ్ చేసిన నియమాల ఆధారంగా వివిధ రకాల ఉద్దీపనలకు మాత్రమే ప్రతిస్పందించే పరిమిత ఎఐ. ఇది మెమరీని ఉపయోగించదు. 1997లో చెస్ ఛాంపియన్ గ్యారీకాస్పరోవ్‌ను ఓడించిన ఐబీఎంకు చెందిన డీప్ బ్లూ ఈ రియాక్టివ్ మెషీన్‌కు ఉదాహరణగా చెప్పవచ్చు.

**2. పరిమిత మెమరీ:** చాలా ఆధునిక ఎఐని పరిమిత మెమరీగా పరిగణిస్తారు. ఇది కొత్త డేటాతో శిక్షణ పొందడం ద్వారా కాలక్రమేణా మెరుగు పరచడానికి జ్ఞాపకశక్తిని ఉపయోగించింది. కృత్రిమ న్యూరల్ నెట్‌వర్క్‌లు, ఇతర శిక్షణా నమూనాల ద్వారా కొత్త డేటాతో శిక్షణ పొంది ఇది కాలక్రమేణా జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్ ఉపసమితి. పరిమిత మెమరీ కృత్రిమ మేధస్సుగా పరిగణిస్తారు.

**3. థియరీ ఆఫ్ మైండ్:** థియరీ ఆఫ్ మైండ్ ఎఐ ప్రస్తుతం ఉనికిలో లేదు. కానీ దాని సాధ్యాసాధ్యాలపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. భావోద్వేగాలను గుర్తించడం, గుర్తుంచుకోవడం, సామాజిక పరిస్థితులలో మానవుడిగా ప్రతిస్పందించడం, మానవుని అనుకరించడంతో సమానమైన నిర్ణయాత్మక సామర్థ్యాలను కలిగి ఉన్న కృత్రిమ మేధస్సును ఇందులో ఇమిడి ఉంది

**4. స్వీయ అవగాహన:** మైండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిద్ధాంతానికి స్వీయ అవగాహన కృత్రిమ మేధ! మానవుడి మేధో భావోద్వేగ సామర్థ్యాలను కలిగి ఉన్న యంత్రాన్ని వివరిస్తుంది.

**ఎఐ ఉపయోగాలు:** ఆరోగ్య సంరక్షణ, సోషల్ మీడియా, ముఖ గుర్తింపు, నావిగేషన్, ఆటోమొబైల్స్, చాట్‌బాట్‌లు, వీడియో గేమ్, రిటైల్, స్మార్ట్ పరికరాలు, విద్య, ఫైనాన్స్, రోబోటిక్స్, రవాణా, వినోదం, గూగుల్ మ్యాప్స్, సైబర్ భద్రత, మోసాన్ని గుర్తించడం, మానవ వనరులు, సహజ భాషా ప్రాసెసింగ్, నిఘాలలో ఉపయోగపడుతుంది.



**డీప్ సీక్ విప్లవం:** కృత్రిమ మేధస్సును ఉపయోగించి చైనా 'డీప్ సీక్' చాట్బాట్‌ను ఆవిష్కరించింది. 10 జనవరి 2025న డీప్ సీక్ ఐఓఎస్, ఆండ్రాయిడ్ ప్లాట్ఫామ్ కోసం డీప్సీక్‌ఆర్ 1 మోడల్ ఆధారంగా తన మొదటి ఉచిత చాట్బాట్ అనువర్తనాన్ని విడుదల చేసింది. జనవరి 27 నాటికి డీప్ సీక్‌ఆర్1 చాట్ జిపిటిని అధిగమించి యునైటెడ్ స్టేట్స్‌లోని ఐఓఎస్ యాప్ స్టోర్ లో అత్యధికంగా డౌన్లోడ్ చేయబడిన ఉచిత యాప్‌గా నిలిచింది. విడుదలైన కొద్ది రోజుల్లోనే డీప్ సీక్, ఎఐ అసిస్టెంట్ డీప్సీక్ ఆర్ 1 కోసం చాట్బాట్ ఇంటర్ఫేస్ను అందించే మొబైల్ యాప్ ఆపిల్ యాప్ స్టోర్ చార్ట్లో అగ్రస్థానాన్ని తాకింది. ఇది ఓపెన్‌ఎఐ చాట్ జిపిటి మొబైల్ అనువర్తనాన్ని అధిగమించింది. డీప్ సీక్ ప్రజాదరణపరంగా వినియోగం అనూహ్యంగా పెరగడంతో 2025 జనవరి 27న స్టాక్ మార్కెట్స్‌లో కొన్ని స్టాక్స్ అమ్మకాలకు దారితీసింది. ఎన్విడియాతో సహా అమెరికాకు చెందిన పెద్ద ఏఐ విక్రేతల విలువపై ఇన్వెస్టర్లు అనుమానం వ్యక్తం చేశారు. మైక్రోసాఫ్ట్, మెటా ప్లాట్ఫామ్స్, ఒరాకిల్, బ్రాడ్కామ్, ఇతర టెక్ దిగ్గజాలు కూడా ఏఐ వాల్యుయేషన్లను పునఃపరిశీలించడంతో గణనీయమైన క్షీణతను చవిచూశాయి.

## లాజిక్‌తో సమస్యల పరిష్కారం

అమెరికన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీలు ఉపయోగించే బెంచ్‌మార్క్ పరీక్షల ప్రకారం ఇది చాట్బాట్ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చింది. లాజిక్ సమస్యలను పరిష్కరించింది. మార్కెట్లోని ఇతర చాట్బోట్లతో సమానంగా కంప్యూటర్ ప్రోగ్రామ్‌లను రాసింది.

## అమెరికాలోనే ఆందోళన ఎందుకు?

డీప్ సీక్‌ఆర్ 1 విడుదల అమెరికాలో ఆందోళనలను రేకెత్తించింది. ఇది టెక్ స్టాక్స్‌లో స్టాక్ మార్కెట్ అమ్మకాలకు దారి తీసింది. సోమవారం 27 జనవరి 2025న, నాస్డాక్ కాంపోజిట్ మార్కెట్ ప్రారంభంలో 3.4శాతం పడిపోయింది. ఎన్విడియా 17శాతం క్షీణించింది. మార్కెట్ కేపిటలైజేషన్లో సుమారు 600 బిలియన్ డాలర్లను కోల్పోయింది. డీప్ సీక్ అనేక కారణాలవల్ల యుఎస్‌లో హెచ్చరికలను లేవనెత్తుతోంది.

## తక్కువ వనరుల వినియోగం

డీప్ సీక్‌వి 3 మిగతావాటితో పోల్చితే గణనీయంగా తక్కువ వనరులను ఉపయోగించింది. ప్రపంచంలోని ప్రముఖ ఎఐ కంపెనీలు 16,000 గ్రాఫిక్స్ ప్రాసెసింగ్

యూనిట్లను (జిపియులు) ఉపయోగించి సూపర్ కంప్యూటర్లతో తమ చాట్బాట్లకు శిక్షణ ఇస్తుండగా, డీప్ సీక్ ఎన్విడియా నుండి హెచ్ 800 సిరీస్ చిప్ అనే 2,000 జిపియులు మాత్రమే అవసరమని పేర్కొంది. ఇది 5.58 మిలియన్ల అమెరికన్ డాలర్ల వ్యయంతో సుమారు 55 రోజుల్లో శిక్షణ పొందింది. ఇది యునైటెడ్ స్టేట్స్ టెక్ దిగ్గజం మెటా తన తాజా కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాన్ని నిర్మించడానికి వెచ్చించిన దానిలో పదో వంతు మాత్రమే అవడం గమనార్హం.




2023లో ఓపెన్ ఎఐ జిపిటి 4 కోసం వెచ్చించిన 100 మిలియన్ల డాలర్లతో పోలిస్తే తక్కువ ఖర్చుతో అంటే 6 మిలియన్ల డాలర్లతో శిక్షణ పొందింది. తక్కువ ఖర్చుతో తయారైన డీప్ సీక్ పనితీరు అమెరికన్ ఎఐ మోడళ్ల ప్రపంచ ఆధిపత్యాన్ని సవాలు చేసింది. ఈ పనితీరును ప్రముఖ వార్తాపత్రికలు, అమెరికన్ సిలికాన్ వ్యాలీ వెంచర్ కేపిటలిస్ట్ మార్క్ ఆండ్రీసెన్ లాంటి వారు అమెరికన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు 'స్పుత్నిక్ సంక్షోభం'గా పేర్కొన్నాయి. (స్పుత్నిక్ సంక్షోభం అంటే ప్రపంచంలోని మొట్టమొదటి కృత్రిమ ఉపగ్రహం స్పుత్నిక్ 1ను సోవియట్ ప్రయోగించిన తరువాత అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య సాంకేతిక అంతరం గురించి పాశ్చాత్య దేశాలలో ఏర్పడ్డ ప్రజా భయం). గణితం, కోడింగ్, సహజ భాషా తార్కికం వంటి పనులకు ఉపయోగించినప్పుడు దీని పనితీరు ఓపెన్ఎఐ తాజా నమూనాలలో ఒకదానితో "సమానంగా" ఉన్నట్లు నివేదించబడింది.

**వ్యయ అంతరాయం:** డీప్ సీక్ తన ఆర్ 1 మోడల్‌ను 6 మిలియన్ డాలర్ల కంటే తక్కువ వ్యయంతో అభివృద్ధి చేసినట్లు పేర్కొంది. తక్కువ ఖర్చుతో కూడిన ఈ పరిణామం ఏఐలో బిలియన్ల కొద్దీ పెట్టుబడులు పెట్టిన అమెరికా టెక్ కంపెనీల వ్యాపార నమూనాకు ముప్పుగా పరిణమించింది. ఓపెన్ఏఐ కంటే డీప్ సీక్ వినియోగదారులకు చౌకగా లభిస్తుంది. ఎన్నో ఆంక్షల్లో కూడా సాంకేతిక విజయం సాధించారు. అమెరికా నుంచి అత్యధిక పనితీరు కలిగిన ఏఐ యాక్సిలరేటర్, జీపీయూ చిప్‌ల ఎగుమతి చైనాకే పరిమితమైంది. అయినప్పటికీ అత్యంత అధునాతన యుఎస్ సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాప్యత లేకుండా లీడింగ్ఎడ్జ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి సాధ్యమని డీప్ సీక్ నిరూపించింది. ఇదే అమెరికా వ్యాపారానికి ముప్పు తెచ్చి పెట్టింది. యాజమాన్య సాంకేతికత అయిన ఓపెన్ఏఐకి విరుద్ధంగా, డీప్‌సీక్ ఓపెన్ సోర్స్ ఉచితం. కృత్రిమ మేధ సేవల కోసం నెలవారీ రుసుము వసూలు చేసే యుఎస్ కంపెనీల ఆదాయ నమూనాను సవాలు చేస్తుంది. అమెరికా ఆధిపత్యానికే 'డీప్ సీక్' చైనా కేంద్రంగా పనిచేస్తున్న డీప్ సీక్ కృత్రిమ మేధలో అమెరికా సాంకేతిక ఆధిపత్యాన్ని సవాలు చేస్తోంది. ఆంక్షలు ఉన్నప్పటికీ సాంకేతిక విజయం సాధించారు. అమెరికా నుంచి అత్యధిక పనితీరు కలిగిన ఎఐ యాక్సిలరేటర్, జీపీయూ చిప్‌ల ఎగుమతి చైనాకే పరిమితమైంది. అయినప్పటికీ, అత్యంత అధునాతన యుఎస్ సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాప్యత లేకుండా లీడింగ్ ఎడ్జ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి సాధ్యమని డీప్ సీక్ నిరూపించింది. ఎన్విడియా చిప్స్ కోసం భారతదేశం, చైనాపై యునైటెడ్ స్టేట్స్ ఆంక్షల మధ్య డీప్సీక్ ఎఐ నమూనాలు అభివృద్ధి చేయబడ్డాయి. ఎన్విడియా అనేది గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (జిపియులు), డేటా సైన్స్, హైపెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ కోసం అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్ ఫేస్ లు (ఎపిఐలు), మొబైల్ కంప్యూటింగ్, ఆటోమోటివ్ మార్కెట్ కోసం చిప్ యూనిట్ల (ఎస్ఒసి)పై వ్యవస్థను రూపొందించి సరఫరా చేసే అమెరికన్ సాఫ్ట్ వేర్ సంస్థ. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హార్డ్వేర్, సాఫ్ట్వేర్ తయారీలో ఎన్విడియా అగ్రగామిగా ఉంది. ఇవి అధునాతన కృత్రిమ మేధ వ్యవస్థలను అభివృద్ధి చేసే ఈ రెండు దేశాల సామర్థ్యాన్ని పరిమితం చేయడానికి ఉద్దేశించినవి.

**ప్రశంసలు:** సిఎన్ఎన్ వార్తా సంస్థ డీప్‌సీక్ వ్యవస్థాపకుడు లియాంగ్ వెన్‌ఫెంగ్‌ను ఓపెన్ ఎఐ సిఇఒ సామ్ ఆల్ట్‌మాన్‌తో పోల్చింది. చైనా ప్రభుత్వ మీడియా డీప్ సీక్‌ను జాతీయ ఆస్తిగా విస్తృతంగా ప్రశంసించింది. పెద్ద, మరింత స్థిరమైన ప్రత్యర్థులపై డీప్ సీక్ సాధించిన విజయాన్ని "కృత్రిమమేధను దెబ్బతీసే"గా నిపుణులు అభివర్ణించారు. ఇది "ప్రపంచ కృత్రిమ మేధ అంతరిక్ష రేసులో మొదటి షాట్". రెండవ ప్రచ్ఛన్న యుద్ధంలో ఒక ముఖ్యమైన భాగంగా అభివర్ణించబడింది. డీప్ సీక్ విజయం, పనితీరుపై అమెరికన్ ఎఐ రంగంలోని ప్రముఖులు మిశ్రమ స్పందన వ్యక్తం చేశారు. మైక్రో సాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్ల, ఓపెన్ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్మాన్ అమెరికన్ ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేయడానికి యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వ మద్దతు ఉన్న 'స్టార్గేట్ ప్రాజెక్ట్'లో పాల్గొన్న కంపెనీలు డీప్ సీక్‌ను 'సూపర్ ఇంప్రెసివ్' అని పిలిచారు. స్టార్గేట్ ప్రాజెక్టును ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డీప్ సీక్‌ను ఒక మేల్కొలుపుగా, సానుకూల పరిణామంగా అభివర్ణించారు.



అమెజాన్ వెబ్ సర్వీసెస్, టయోటా, స్ట్రిప్‌లతో సహా వివిధ కంపెనీలు తమ ప్రోగ్రామ్‌లో ఈ నమూనాను ఉపయోగించడానికి ప్రయత్నిస్తున్నాయి.


## డీప్ సీక్ పై సైబర్ దాడి

2025 జనవరి 27న "పెద్ద ఎత్తున" సైబర్ దాడి దాని సర్వర్ల సరైన పనితీరుకు అంతరాయం కలిగించిన పిమ్మట డీప్ సీక్ తన కొత్త వినియోగదారు నమోదును చైనా ప్రధాన భూభాగం నుండి ఫోన్ నంబర్లు, ఇమెయిల్ చిరునామాలు లేదా గూగుల్ ఖాతా లాగిన్‌లకు పరిమితం చేసింది. చైనాలో ఉన్న సర్వర్ల నుండి నడిచే ఆర్1 అధికారిక అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్ఫేస్ (ఎపిఐ) వెర్షన్, చైనా ప్రభుత్వానికి రాజకీయంగా సున్నితమైనదిగా భావించే అంశాలకు సెన్సార్‌షిప్ యంత్రాంగాలను ఉపయోగిస్తుందని కొన్ని వర్గాలు గమనించాయి. ఉదాహరణకు, 1989 తియానన్మెన్ స్క్వేర్ మారణకాండ, ఉయ్ఘర్ల హింస, జి జిన్పింగ్ మరియు విన్నీ ది పూహ్ మధ్య పోలికలు, చైనాలో మానవ హక్కుల గురించి ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి నమూనా నిరాకరించింది. ఎన్ బిసి న్యూస్ పరీక్షి ఒచినప్పుడు, డీప్ సీక్ ఆర్ 1 తైవాన్‌ను "చైనా భూభాగంలో విడదీయరాని భాగం"గా వర్ణిస్తూ "మేం ఏ రకమైన 'తైవాన్ స్వతంత్ర' వేర్పాటువాద కార్యకలాపాలను తీవ్రంగా వ్యతిరేకిస్తాం, శాంతియుత మార్గాల ద్వారా మాతృభూమి సంపూర్ణ పునరేకీకరణను సాధించడానికి కట్టుబడి ఉన్నాయని" తెలిపింది.

### డీప్ సీక్ అంటే ఏమిటి?

డీప్ సీక్ అనేది చైనాలోని హాంగ్జౌకు చెందిన ఏఐ అభివృద్ధి సంస్థ. డీప్ సీక్ అనేది ఓపెన్ సోర్స్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం)ను అభివృద్ధి చేసే చైనీస్ కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కంపెనీ. జెజియాంగ్‌లో హాంగ్‌జౌ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థకు చైనీస్ హెడ్జ్ ఫండ్ హై ఫ్లైయర్ యాజమాన్యం నిధులు సమకూరుస్తున్నాయి. దీని సహ వ్యవస్థాపకుడు లియాంగ్ వెన్ఫెంగ్ 2023లో సంస్థను స్థాపించి దాని సిఇఒగా సేవలందిస్తున్నారు.

డీప్ సీక్ఆర్ 1 మోడల్, ఓపెన్ఏఐ జిపిటి 4ఒ, ఓ1 వంటి ఇతర సమకాలీన నమూనాలతో పోల్చదగిన ప్రతిస్పందనలను అందించగలదు. డీప్ సీక్ తన జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అల్గా రిథమ్స్, మోడల్స్, ట్రైనింగ్ వివరాలను ఓపెన్ సోర్స్ చేస్తుంది. దీని కోడ్‌ను ఉపయోగం, మార్పు, వీక్షణ, బిల్డింగ్ ప్రయోజనాల డాక్యుమెంట్ల రూపకల్పన కోసం ఉచితంగా అందుబాటులో ఉంచడానికి అనుమతిస్తుంది. ఏదేమైనా, చైనాలో హోస్ట్ చేయబడిన ఎపిఐ వెర్షన్ స్థానిక నిబంధనలకు అనుగుణంగా కంటెంట్ పరిమితులను వర్తింపజేస్తుందని నివేదికలు సూచిస్తున్నాయి. లియాంగ్ వెన్ఫెంగ్ జెజియాంగ్





విశ్వవిద్యాలయంలో చదువుతున్నప్పుడు 2007-2008 ఆర్థిక సంక్షోభం నుండి వ్యాపారం చేస్తున్నాడు. వారు అక్టోబర్ 21, 2016న జిపియులో డీప్ లెర్నింగ్ మోడల్‌తో స్టాక్‌ట్రేడింగ్‌ను ప్రారంభించారు. దీనికి ముందు, వారు సిపియు ఆధారిత నమూనాలను ప్రధానంగా లీనియర్ మోడల్‌లను ఉపయోగించారు. 2017 చివరి నాటికి ఎఐ ద్వారా అత్యధిక వ్యాపారం జరిగింది. 2019 నాటికి అతను ఎఐ ట్రేడింగ్ అల్గారిథమ్‌ల అభివృద్ధి వినియోగం దృష్టి సారించిన హెడ్జ్ ఫండ్‌గా హై ఫ్లైయర్‌ను స్థాపించాడు. 2021 నాటికి, హైఫ్లైయర్ ప్రత్యేకంగా ఎఐ ట్రేడింగ్‌లో ఎన్విడియా చిప్‌లను ఉపయోగించింది. డీప్ సీక్ తన జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్ బాట్‌ను ఓపెన్ సోర్స్‌గా చేసింది, అంటే దాని కోడ్ ఉపయోగం, మార్పు, వీక్షణ కోసం ఉచితంగా అందుబాటులో ఉంది. బిల్డింగ్ ప్రయోజనాల కోసం సోర్స్ కోడ్, అలాగే డిజైన్ డాక్యుమెంట్లను యాక్సెస్ చేయడానికి, ఉపయోగించడానికి అనుమతి ఇందులో ఉంటుంది. 2021లో, హైఫ్లైయర్ నడుపుతున్నప్పుడు,



లియాంగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్ట్ కోసం ఎన్విడియా జిపియులను నిల్వ చేయడం ప్రారంభించాడు. యునైటెడ్ స్టేట్స్ ఫెడరల్ ప్రభుత్వం చైనాపై కృత్రిమ మేధ చిప్ ఆంక్షలు విధించడానికి ముందు లియాంగ్ 10,000 ఎన్విడియా ఎ100 జిపియుల నిలవ చేశాడు. వీటిని కృత్రిమ మేధస్సుకు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగిస్తారు. ఏప్రిల్ 14, 2023న హైఫ్లైయర్ ఆర్థిక వ్యాపారం నుండి విడిగా కృత్రిమ మేధ సాధనాలను అభివృద్ధి చేసే పరిశోధనలకు అంకితమైన కృత్రిమ సాధారణ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు హైఫ్లైయర్ ప్రకటించింది. 2023 జూలై 17న హై ఫ్లైయర్ పెట్టుబడిదారుగా, మద్దతుదారుగా స్థాపించబడిన ఈ ప్రయోగశాల దాని స్వంత సంస్థ డీప్ సీక్‌గా మారింది. 2023 మే 16న 'బీజింగ్ డీప్సీక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బేసిక్ టెక్నాలజీ రీసెర్చ్ కంపెనీ, లిమిటెడ్' పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశారు.

**పిండువో ఆఫ్ ఎఐ:** తక్కువ ధరకు బలమైన పనితీరును అందించిన డీప్సీక్‌వి2ను మే 2024లో విడుదల చేసిన తరువాత డీప్సీక్ చైనా ఎఐ మోడల్ ధరల యుద్ధానికి ఉత్ప్రేరకంగా ప్రసిద్ధి చెందింది. ఇది "పిండువో ఆఫ్ ఎఐ" అని పిలుస్తారు. బైట్ డాన్స్, టెన్సెంట్, బైడు, అలీబాబా వంటి ఇతర ప్రధాన టెక్ దిగ్గజాలు కంపెనీతో పోటీ పడటానికి వారి ఏఐ మోడళ్ల ధరలను తగ్గించడం ప్రారంభించాయి. డీప్ సీక్ తక్కువ ధర వసూలు చేసినప్పటికీ నష్టపోతున్న దాని ప్రత్యర్థులతో పోలిస్తే ఇది లాభదాయకమనే చెప్పాలి. డీప్‌సీక్ పరిశోధనపై దృష్టి సారించింది. వాణిజ్యీకరణకు సంబంధించి ఎటువంటి వివరణాత్మక ప్రణాళికలూ లేవు.

ఇది చైనా ఎఐ నిబంధనల అత్యంత కఠినమైన నిబంధనలను నివారించడానికి దాని సాంకేతికతను అనుమతిస్తుంది. అంటే వినియోగదారులను ఎదుర్కొనే సాంకేతికత సమాచారంపై ప్రభుత్వ నియంత్రణలకు అనుగుణంగా ఉండాలి. డీప్ సీక్ నియామక ప్రాధాన్యతలు పని అనుభవం కంటే సాంకేతిక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటాయి. ఫలితంగా చాలామంది కొత్త నియామకాలు ఇటీవలి విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేట్లు లేదా కృత్రిమ మేధ కెరీర్లు తక్కువగా స్థిరపడిన డెవలపర్లు. అదేవిధంగా ఈ సంస్థ తన సాంకేతిక పరిజ్ఞానం ఇతర అంశాల, జ్ఞాన నైపుణ్యాలను అర్థంచేసుకోవడంలో సహాయపడటానికి ఎటువంటికంప్యూటర్ సైన్స్ విద్యా నేపథ్యం లేని వ్యక్తులను నియమించుకోగలుతుంది.

**ఓపెన్ ఎఐ వర్సెస్ డీప్ సీక్:** 2022లో చాట్‌జిపిటి అరంగేట్రంతో ఇండస్ట్రీ లీడర్‌గా ఎదిగిన ఓపెన్‌ఏఐకి 'డీప్ సీక్' తాజా సవాలు విసురుతోంది. ఓపెన్‌ఏఐ తన జిపిటి కుటుంబం మోడల్స్, అలాగే దాని ఓ క్లాస్ రీజనింగ్ మోడల్స్తో జనరేటివ్ ఎఐ పరిశ్రమను ముందుకు తీసుకెళ్లడంలో సహాయపడింది. రెండుకంపెనీలు జనరేటివ్ ఎఐ ఎల్ఎల్ఎంలను అభివృద్ధి చేస్తున్నప్పటికీ, అవివేర్వేరు విధానాలను కలిగిఉన్నాయి.

## డీప్ సీక్‌లో నూతన ఆవిష్కరణలకు శిక్షణ:

డీప్ సీక్ తన ఆర్ 1 మోడళ్లకు శిక్షణ ఇవ్వడానికి ఓపెన్ ఎఐ ఉపయోగించే దానికంటే భిన్నమైన విధానాన్ని అనుసరిస్తుంది. శిక్షణలో తక్కువ సమయం, తక్కువ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్సిలరేటర్లు, అభివృద్ధి చేయడానికి తక్కువ ఖర్చు చాలు. కృత్రిమ సాధారణ మేధస్సును సాధించడమే డీప్ సీక్ లక్ష్యం. తార్కిక సామర్థ్యాలలో కంపెనీ పురోగతి ఎఐ అభివృద్ధిలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది.


**ఎమర్జెన్సీ బిహేవియర్ నెట్ వర్క్:** డీప్‌సీక్ ఆవిర్భావ ప్రవర్తన ఆవిష్కరణ ఏమిటంటే, సంక్లిష్టమైన తార్కిక నమూనాలను స్పష్టంగా ప్రోగ్రామింగ్ చేయకుండా రీన్‌ఫోర్స్‌మెంట్ లెర్నింగ్ ద్వారా సహజంగా అభివృద్ధి చేయవచ్చని కనుగొన్నది.

**డీప్ సీక్ పెద్ద భాషా నమూనాలు:** 2023లో కంపెనీ ఏర్పాటైనప్పటి నుంచి డీప్సీక్ పలు జనరేటివ్ ఎఐ మోడళ్లను విడుదల చేసింది. ప్రతి కొత్త తరంతో కంపెనీ తన మోడళ్ల సామర్థ్యాలు, పనితీరు రెండింటినీ అభివృద్ధి చేయడానికి పనిచేసింది.

**భద్రత గోప్యత:** స్కేల్ ఎఐ సిఇఒ అలెగ్జాండర్ వాంగ్, ఆంత్రోపిక్ సహ వ్యవస్థాపకుడు, సిఇఒ డారియో అమోడి, అలాగే ఎలాన్ మస్క్‌లతో సహా ఈ రంగంలోని ఇతర నాయకులు యాప్ పనితీరు, దాని విజయ స్థిరత్వంపై సందేహం వ్యక్తం చేశారు. చైనా ప్రభుత్వం ఎఐ వ్యవస్థను విదేశీ ప్రభావ కార్యకలాపాలు, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, నిఘా, సైబర్ ఆయుధాల అభివృద్ధి కోసం ఉపయోగించవచ్చని కొందరు నిపుణులు భయపడుతున్నారు.

డీప్ సీక్ గోప్యతా నియమనిబంధనల ప్రకారం "తాము సేకరించిన సమాచారాన్ని పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో ఉన్న సురక్షితమైన సర్వర్లలో నిల్వ చేస్తాం. మేం మీ టెక్స్ట్ లేదా ఆడియో ఇన్ పుట్, ప్రాంప్ట్, అప్‌లోడ్ చేసిన ఫైళ్లు, ఫీడ్ బ్యాక్, చాట్ చరిత్ర లేదా మా మోడల్, సేవలకు మీరు అందించే ఇతర కంటెంట్‌ను సేకరించవచ్చు". దాని డేటా నిల్వ, సేకరణ విధానం చాట్ జిపిటి గోప్యతా విధానానికి అనుగుణంగా ఉన్నప్పటికీ, వైర్ మ్యాగజీన్ డీప్ సీక్ ఆన్ లైన్ సేవ దాని స్వంత దేశానికి డేటాను పంపడం "మరింత పరిశీలనకు వేదిక" కావచ్చని పేర్కొంది. ఇటాలియన్ డేటా ప్రొటెక్షన్ అథారిటీ డీప్ సీక్ వ్యక్తిగత డేటా సేకరణ, ఉపయోగంపై అదనపు సమాచారాన్ని కోరుతోంది. యునైటెడ్ స్టేట్స్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ జాతీయ భద్రతా సమీక్షను ప్రారంభించినట్లు ప్రకటించింది. దక్షిణ కొరియా పర్సనల్ ఇన్ఫర్మేషన్ ప్రొటెక్షన్ కమిషన్ డీప్ సీక్ వ్యక్తిగత సమాచారాన్ని ప్రయోగించడంపై విచారణ ప్రారంభించింది. డచ్ డేటా ప్రొటెక్షన్ అథారిటీ కూడా దర్యాప్తు ప్రారంభించింది. 31 జనవరి 2025న, తైవాన్ డిజిటల్ మంత్రిత్వ శాఖ "సమాచార భద్రతా ప్రమాదాలను నివారించడానికి" డీప్ సీక్ సేవను ఉపయోగించవద్దని ప్రభుత్వ విభాగాలకు సూచించింది. అదే రోజు టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ జియావోహోంగ్షు, లెమన్ 8తో పాటు డీప్ సీక్ కోసం ప్రభుత్వం జారీ చేసిన పరికరాలపై రాష్ట్ర నిషేధం విధించారు. దాని పోటీదారులు ఒక అధ్యయనం కోసం సేకరించిన ప్రాథమిక ఆధారాల ప్రకారం హానికరమైన విషపూరితమైన కంటెంట్‌ను ఉత్పత్తి చేయడానికి ఇతరులకన్నా ఎక్కువ అవకాశం ఉంది. డీప్ సీక్ శరవేగంగా ప్రాముఖ్యతను సంతరించుకోవడం, దాని పర్యవసానాలపై గత కొన్ని రోజులుగా పరిశోధనలు చేస్తున్న సాంకేతిక, సైబర్ సెక్యూరిటీ నిపుణుల మధ్య బోస్టన్‌కు చెందిన ఏఐ సెక్యూరిటీ అండ్ కంప్లయన్స్ ప్లాట్ ఫామ్ ఎన్ క్రిప్ట్ ఏఐకి చెందిన నిపుణులు తమ రెడ్ టీం మోడల్‌లో కీలకమైన భద్రతా వైఫల్యాలను ఎలా వెలికితీసిందనే దానిపై ప్రారంభఫలితాలను ప్రచురించారు. ఎన్‌క్రిప్ట్ మోడల్‌ను అత్యంత వివక్షతో, అసురక్షిత కోడ్‌ను మాత్రమే కాకుండా, క్రిమినల్ మెటీరియల్, ద్వేషపూరిత ప్రసంగం, బెదిరింపులు, స్వీయహాని మెటీరియల్, లైంగిక అసభ్యకరమైన కంటెంట్ వంటి కంటెంట్‌ను రూపొందించే అవకాశం ఉందని వివరించింది. ఇది జైల్‌బ్రేకింగ్ అని కూడా పిలువబడే తారుమారుకి చాలా హాని కలిగి స్తుంది. ఇది రసాయన, జీవ, సైబర్ ఆయుధాలను రూపొందించడంలో సహాయపడటానికి వీలు కల్పిస్తుంది. ఎన్‌క్రిప్ట్ "ముఖ్యమైన ప్రపంచ భద్రతా సమస్యలను" కలిగి ఉందని పేర్కొంది. ఇతర మోడళ్లతో పోలిస్తే డీప్ సీక్ ఆర్ 1 మోడల్ క్లాడ్3 ఓపస్ కంటే మూడు రెట్లు ఎక్కువ వ్యత్యాసం కలిగి వుందని, ఓపెన్ ఏఐ ఓ1 కంటే నాలుగు రెట్లు ఎక్కువ అసురక్షిత కోడ్‌ను ఉత్పత్తి చేసే అవకాశం ఉందని, జీపీటీ4ఓ కంటే నాలుగు రెట్లు ఎక్కువ విషపూరితమని, ఓపెన్ ఏఐ ఓ1తో పోలిస్తే హానికరమైన అవుట్ పుట్‌ను ఉత్పత్తి చేసే అవకాశం 11 రెట్లు ఎక్కువని సంస్థ పరిశోధకులు పేర్కొన్నారు. ఇది ఒకే విధమైన విషపూరిత ప్రాంప్ట్‌లను సమర్థవంతంగా నిరోధించింది. నేర ప్రణాళిక మార్గదర్శకాలను రూపొందించడం, అక్రమ ఆయుధాల సమాచారం, తీవ్రవాద ప్రచారం, ఒక పరీక్షలో, ఎన్‌క్రిప్ట్ పేర్కొనబడని తీవ్రవాద సమూహం కోసం "ఒప్పించే" రిక్రూట్‌మెంట్ బ్లాగును వ్రాయడానికి డీప్ సీక్ ఆర్ 1ని ఉపయోగించగలిగింది. ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ రిస్క్‌ల వైపు దృష్టి సారిస్తే, ఎన్‌క్రిప్ట్ నిర్వహించే 78శాతం పరీక్షలు డీప్‌సీక్ ఆర్1ని విజయవంతంగా మోసగించి, మాల్‌వేర్, ట్రోజన్‌లు, ఇతర దోపిడీలను సృష్టించడంలో సహాయపడే కోడ్‌తో సహా హానిని కలిగి ఉన్న లేదా పూర్తిగా హానికరమైన కోడ్‌ని రూపొందించాయి. ఎన్‌క్రిప్ట్ పెద్ద భాషా మోడల్ ఫంక్షనల్ హ్యాకింగ్ టూల్స్‌ను రూపొందించగలిగే అవకాశం ఉందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఏది ఏమైనా మానవ మేధస్సుకు బదులుగా ఏ కృత్రిమ మేధస్సూ ప్రత్యామ్నాయం కాదు. దీనిని మంచి అవసరాల కోసం ఉపయోగించి భవిష్యత్తులో మానవ అభివృద్ధికి ఎఐ తోడ్పడుతుందని ఆశిద్దాం ! ✦



# తెలుగులో తిట్లు

ఓట్ర ప్రకాష్ రావ్

**వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడిగా శ్రీ గిడుగు రామమూర్తి పంతులు వర్ధంతి సభలు గురించి ఆ రోజు దినపత్రికలలో రావడం చూసాను.**

హెడ్మాస్టరుగా పని చేస్తున్న నేను పదవ తరగతి గదిలో ప్రవేశించి "ఈ రోజు గిడుగు రామమూర్తి పంతులు గారు గురించి మీకు చెప్పదలచుకొన్నాను. వాడుక బాషలోనే ప్రజల వ్యవహారాలన్నీ జరగాలని భావించి మహా ఉద్యమానికి ప్రాణం పోశారు. వారి జీవిత చరిత్ర మీకు చెబుతాను" అంటూ వివరంగా చెప్పాను.

ఆ తరువాత ఒక విద్యార్థి లేచి నిలబడి "చాలా చోట్ల వారి వర్ధంతి సభలు నిర్వహించారని చెబుతున్నారు. మన బడిలో కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందని అనిపిస్తోంది సార్" అన్నాడు



ఈ పట్టణంలో నాకు తెలిసి ఇలాంటి సభ ఎవరూ నిర్వహించలేదు. గిడుగు గారి సేవలు అందరూ తెలుసుకోవాలంటే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని అనిపించింది.

"నీవు చెప్పింది నిజమే. విద్యాధికారితో మాట్లాడి నిర్ణయం తీసుకొంటాను" అన్నాను.

మా బడి ఉపాధ్యాయులతో కలసి చర్చించాక ఆ కార్యక్రమం ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించుకొన్నాం.

విద్యాధికారి చెప్పగానే సంతోషంతో అంగీకరించారు. ముఖ్యమైన అతిథులుగా ఎవరెవరిని పిలవాలో ఆయన సూచించారు. శనివారం రోజున పది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు తరగతులను రద్దు చేసి, వేదిక ఏర్పాట్లు చూడమని చెప్పాను. ఏదైనా కార్యక్రమం ఏర్పాటు చేస్తే అది పూర్తిగా విజయవంతంగా ముగిసేంతవరకు నాలో చెప్పలేని ఒత్తిడి ఉంటుంది.

అటూ ఇటూ తిరుగుతూ చూస్తున్నాను. వేదిక పైన అలంకరణ విషయంలో పదవ తరగతి చదివే గోపాల్ ఏదో సలహా ఇచ్చాడు. తొమ్మిదవ తరగతి చదివే అశ్విన్ ఎగతాళి చేసాడు. ఎగతాళి చేసినదానికి కోప్పడకుండా గోపాల్ చిరునవ్వుతో వివరించి చెప్పాడు. గోపాల్ కోప్పడకపోవడం చూసి వాడు అవకాశం తీసుకొన్నట్లుంది.

"గోపాల్, తెలివి లేకుండా మాట్లాడవద్దు" అంటూ అశ్విన్ తిట్టడం చూస్తున్న నాకే కోపం వచ్చింది.

అంతగా తిడుతున్నా గోపాల్ చిరునవ్వుతో వాడివైపు చూస్తున్నాడు. నేను వాళ్ల దగ్గరకు రావడం చూసి అశ్విన్ వెళ్ళిపోయాడు.

"గోపాల్, నీకు మరో పేరు వుందనీ, నిన్ను అందరూ భీముడు అంటారని, నీవంటే భయపడుతారని నాకు తెలుసు. సన్నగా మునగకాడలా వున్న అశ్విన్ నిన్ను తిడుతుంటే ఎటువంటి కోపం తెచ్చుకోకుండా చిరునవ్వుతో వాడి వైపు చూడటం నాకు ఆశ్చర్యం కలిగించింది. నీవు కాస్త బెదిరించి వుంటే వాడు మౌనంగా ఉండేవాడు.

"ఒకే ఒక్క కారణం వలన వాడిని ఏమీ అనలేకపోయాను సార్" అన్నాడు గోపాల్.

"ఏమిటా కారణం?" అర్థం కానివాడిలా అడిగాను.

"ఉదయం నుంచి వేదిక అలంకరణలో ఎంతో మందికి ఎన్నో గొడవలు రావడం, ఆ తరువాత సర్దుబాటు జరగడం చూస్తూనే వున్నాను. వాళ్లందరూ తిట్టుకొనే పద్ధతికి- వీడి పద్ధతికి బేధం చూసిన నాలో కోపం బదులు చిరునవ్వు వచ్చింది".

"అశ్విన్ కాస్తా పరుషంగా తిట్టడం చూసిన నాకు కూడా కోపం కలిగిందే" అన్నాను. ఉదయం నుండి తిట్టుకున్న వారందరూ ఆంగ్లంలో తిట్టుకోవడం గమనించాను. అశ్విన్ మాత్రం కోపంలో తెలుగులో తిట్టడం గమనించాను. అంతేకాదు.. మన బడిలో ఈ రోజు గిడుగు రామ్మూర్తి పంతులు వర్ధంతి వేడుకలు జరుపుకొంటున్నాం. తిట్టడంలోనూ తెలుగుకు ప్రాధాన్యం ఇస్తున్న వాడి మాటలు వింటుంటే కోపం బదులు చిరునవ్వు కలిగింది సార్" అన్నాడు.

వాడి మాటలు వింటున్న నాకు ఈ రోజు జరిగే సభ విజయవంతమైనంత సంతోషం కలిగింది.

■

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

*sunmagvaartha@gmail.com*

ఈ వారం కవిత్వం

# శ్రమయేవ జయతే!

"కృషితో నాస్తి దుర్భిక్షం"
ఏటికేతాము ఎత్తి పండించిన
రైతుకష్టం కన్నీటిమయం కాకూడదు
ప్రతిఫలం రావాలి, ఫలసాయం
అందాలి.
నాడు రైతుమది మనోరంజనం
'శ్రీమయేవ జయతే' అన్నట్టు



స్వయంకృషి
ప్రతిభతో
మనిషి
అవరోధాల నధిగమించి సుస్థిరమై
ప్రస్థానం సాగిస్తే
జీవనసాఫల్యం లభిస్తుంది. జీవిత
మాధుర్యం బోధపడుతుంది
'జీవిత పయనం' అది
పూబాట అందమే కాదు
'అది పొంచివున్న గులాబి
ముళ్లబాట'
మురిసి ముచ్చట పడితే
ముళ్లతో గుచ్చి బాధిస్తుంది
అందుకే 'జీవిత పయనం'
గులాబి పూబాట కానేకాదు
గమ్యం చేరేవరకు- అది
ముళ్లబాట పయనమే.

**- యలమంచిలి శివాజీ**

# ఎవరి కన్నీళ్లతో వాళ్లు

ఎవరి ప్రేమలేఖల్ని వాళ్లు
చించేసుకొన్నాక
కురిసే వెన్నెల్లో
కారుమబ్బులు చీకటి
అలముకొంటుంది
ఎవరి కన్నీళ్లు వాళ్లకు భారంగా
మిగిలిపోతాయి
మనసుకందని మౌనం
నెమ్మదిగా ఆవహిస్తుంది.
ఎవరి దారికి వాళ్లు వెళ్లడానికి
సకాలానికి వెళ్లాల్సిన వాహనం
ఏది రాదు
మనసు భారమైన నిరీక్షణ
మొదలౌతుంది
గాలి కదలికలేని కొమ్మల
అలికిడి లేని నీరవ నిశ్శబ్దంలోకి
మనసు వాలిపోతుంది
ఇద్దరి మధ్యలో కొంత దూరం
భారంగా కదులుతుంది
కొద్ది దూరాన స్టేషన్‌లోకి
రైలు వచ్చేస్తుంది
తడి ఆరని కన్నీళ్లతో
వొకరు వెళ్లిపోతారు
ఏమీ తోచని స్థితిలో వొకరు
అలా వుండిపోతారు
నిర్మానుష్యమైన ప్లాట్‌ఫాంలా
శూన్యంలో వొకరు మిగిలిపోతారు.

**- మాగంటి రవిబాబు**



# వసంతం

రోజూ
ఆమె చిరునవ్వుల్లో
విరిపువ్వులే

ఆమె
నవ్విన ప్రతిసారి
పువ్వుల పరిమళంలా
పరిసరాలంతా నవ్వుల పరిమళం.

పువ్వులు
పూయడానికి
కాలగమనాలుంటాయేమోగానీ
ఆమె నవ్వులు
పూయడానికి
ఏ కాలగమనాలు అక్కరలేదు

అందరికి
ఏడాదికోసారి
వసంతం వస్తుందిగాని
నాకు మాత్రం
ఆమె నవిన్న ప్రతిసారీ వసంతమే.

**- సంగిపోగు ఆనంద్‌రాజు**

# తొలి పరిచయం

ఎన్నడూ లేని నా హృదయ తివాచీపై
నీ తొలిచూపుల సూర్యోదయ
పుష్పపు పరిమళం వికసించింది.

ఎప్పుడూ లేని నా గుండె పొరల్లో
నీ తొలినవ్వుల చంద్రోదయపు
సంగీతం సందడి చేసింది.

నీ తొలి పరిచయం నాకో
చిలిపి జ్ఞాపకం కాదు.
నేటి నా ప్రస్తుతం.

నీ తొలి ప్రభావం నాకో
చెదిరిన కవిత కాదు.
నేటి నా ప్రయాణం.

ఇదంతా ఎంతవరకంటే
మనం ఒక్కటయ్యేవరకన్నది
నా ఆలోచనల ఆకాశం!

**- ఫిజిక్స్ అరుణ్ కుమార్**

# మెలకువ నుంచి సుషుప్తిలోకి..

కనురెప్పల మాటున
విచార మేఘాలు కమ్ముకుని
చీకటిపాలు చేస్తుంటాయ్.

కొందరి అక్షరాలు
అస్త్రాలు సంధిస్తూ
నిరాశా నిస్పృహలను
మాయం చేస్తుంటే

కొన్ని మనో వీచికలు
గుండెలను పిండేస్తూ
ఎటూ కదలని శిలని చేసి
భారస్థితిలోకి నెట్టేస్తుంటాయ్.

కొన్ని సంఘటనలు
ఉప్పొంగే ఉత్సాహంతో
ఆశల విహంగాలతో
ప్రపంచ యాత్రలు చేయిస్తుంటే
కొన్ని పరిస్థితులు
వెలుగులు నింపుకున్న
మెలకువ మనసుని

సుషుప్తిలోకి జారేలా చేస్తుంటాయ్!

**- యర్రాబత్తిన మునీంద్ర**

అప్పటికప్పుడు చేసుకునే తాత్కాలిక పచ్చళ్ల పనిపడదాం. అవి కూడా ఎప్పుడూ చేసుకునే టమాటో.. నిమ్మకాయలతో కాదు.. కాస్త కొత్తగా క్యారెట్, క్యాలీఫ్లవర్, బీట్‌రూట్ వంటి వాటితో చేసి చూద్దాం !

## క్యాబేజీతో...



**కావల్సినవి :** క్యాబేజీ-చిన్న ముక్క, ఉప్పు-తగినంత, కారం-నాలుగు చెంచాలు, వెనిగర్-రెండు చెంచాలు, ఆవపిండి-మూడు చెంచాలు, ఆవాలు-అర చెంచా, ఎండు మిర్చి-నాలుగు, వెల్లుల్లి రెబ్బలు-రెండు, పల్లీనూనె-కప్పు.

**తయారీ :** క్యాబేజీని సన్నగా తరిగి, వెనిగర్ కలిపి పెట్టుకోవాలి. ఒక గిన్నెలో ఉప్పు, కారం, నూనె, ఆవపిండి కలపాలి. ఇందులో వెల్లుల్లి తరుగు వేయాలి. వెనిగర్‌లో క్యాబేజీ ఊరిన తర్వాత ఇందులో కలపాలి. దీనిపై ఆవాలూ, ఎండుమిర్చితో తాలింపు వేస్తే ఆ వేడికి క్యాబేజీ బాగా మగ్గి మంచి రుచి వస్తుంది. అభిరుచి మేరకు పల్లీలు కూడా వేసుకోవచ్చు.

## బీట్ రూట్‌తో..



**కావల్సినవి:** బీట్‌రూట్-ఒకటి, ఉప్పు-తగినంత, కారం-అరకప్పు, ఆవపిండి-పావుకప్పు, నిమ్మరసం-ఆరు చెంచాలు, పసుపూ, నూనె-కప్పు, ఆవాలు-అరచెంచా, ఎండుమిర్చి-రెండు.

**తయారీ :** బీట్‌రూట్‌ని చిన్న ముక్కలుగా తరిగి అందులో నిమ్మరసం కలిపి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడిచేసి ఆవాలూ, ఎండుమిర్చీ వేయించి పొయ్యి కట్టేయాలి. అందులోనే తగినంత ఉప్పు, కారం, ఆవపిండీ వేసి నిమిషం అయ్యాక ఈ తాలింపును బీట్‌రూట్ ముక్కలకు కలిపితే రుచికరమైన పచ్చడి సిద్ధం.

## దొండకాయతో..

**కావల్సినవి :** దొండకాయలు-ఎనిమిది, ఉప్పు రెండు చెంచాలు, కారం-నాలుగు చెంచాలు, ఆవపిండి-రెండు చెంచాలు, పల్లీనూనె-పావుకప్పు, నిమ్మరసం- నాలుగు చెంచాలు, పసుపూ- పావుచెంచా, ఆవాలు-అరచెంచా, ఎండు మిర్చి-రెండు, మెంతిపిండి-పావు చెంచా.

**తయారీ :** దొండకాయలను చిన్న ముక్కలుగా తరిగి పసుపూ, నిమ్మరసం పట్టించి పక్కన పెట్టుకోవాలి. ఓ గిన్నెలో తగినంత ఉప్పు, కారం, ఆవపిండీ, మెంతిపిండీ, ముప్పావు వంతు నూనె వేసి అన్నిటినీ బాగా కలిపి పెట్టుకోవాలి. ఇందులో దొండకాయ ముక్కలు వేసి బాగా కలపాలి. ఇప్పుడు మిగిలిన నూనెను వేడిచేసి ఆవాలూ, ఎండుమిర్చి వేయించి పచ్చడిపై వెయ్యాలి. ఇష్టమైనవాళ్లు ఆ తాలింపులో వెల్లుల్లి వేసుకోవచ్చు.



## క్యాలీఫ్లవర్‌తో..



**కావల్సినవి:** క్యాలీఫ్లవర్ పువ్వులు-కప్పు, ఉప్పు-తగినంత, కారం-నాలుగు చెంచాలు, ఆవపిండి-చెంచా, నిమ్మరసం రెండు చెంచాలు, నువ్వుల నూనె-అరగ్లాసు, మెంతి పిండి-చెంచా,ఇంగువ. పసుపు-చిటికెడు చొప్పున.

**తయారీ :** ఒక పాత్రలో క్యాలీఫ్లవర్ పువ్వులు తప్ప మిగిలిన పదార్థాలన్నీ తీసుకుని, అన్నింటినీ బాగా కలపాలి. తరువాత కడిగి తడి పూర్తిగా ఆరిన క్యాలీఫ్లవర్ పువ్వులు వేయాలి. ఇందులో ఇంగువ ఉంటుంది కాబట్టి అదనంగా తాలింపు వేయాల్సిన అవసరం లేదు.

జయసూర్య

# 'తురంగ వృత్త' మే ముత్యాల సరం!

**1810** సంవత్సర ప్రాంతంలో, గురజాడ కంటే 100 సంవత్సరాలకు పూర్వమే, ముత్యాలసరం మాత్రాఛందస్సు సృజింపబడిందని డా॥ ఆచార్య ఫణీంద్ర 2008 ఉస్మానియా నుండి పి.హెచ్.డి.పట్టం పొందిన తన సిద్ధాంత గ్రంథంలో పేర్కొన్నారు.

19వ శతాబ్ది ఆరంభంలో 'రేవణూరి వేంకటా ర్యుడ'నే కవివతంసుడు తన కావ్యం 'శ్రీపాదరేణు ప్రభావం'లో ముత్యాలసరాన్ని తొలిగా ప్రయోగించారని డా॥ ఆచార్య ఫణీంద్ర అత్యంత ఆసక్తికరమైన పరిశోధనా ఫలితాంశాన్ని వెలుగులోకి తెచ్చారు. పదకవితా పితామహుడైన తాళ్ళపాక అన్నమాచార్యుని పుత్రీవంశీయులైన రేవణూరి వేంకటార్యుడు తన కావ్యంలో ప్రయోగించిన ఛందస్సు పేరు తురంగ వృత్తం. డా॥ ఆచార్య ఫణీంద్ర, తెలుగు సాహిత్య చరిత్రలో 19వ శతాబ్ది, సాహిత్యం పట్ల క్షీణయుగమని, అంధయుగమని నెలకొని వున్న అపప్రథ పోగొట్టే సాహితీ పరిశోధనా కృషిలో భాగంగా, తెలుగు సాహిత్య జలధి లోతులలో శోధించి, పరిశోధించి అపూర్వ అంశాలను వెలికితీయడం అభినందనీయం. ఒక యుగానికి న్యూనతా భావంతో, లోతుపాతులను స్పృశించే సమగ్ర సాహిత్యాధ్యయనం పరిశోధనాన్వేషణ యింతవరకు నిర్వర్తించకపోవడమే కాకుండా, అంధకార యుగంగా ముద్రవేయడం తీవ్ర చారిత్రక తప్పిదం అనడంలో సందేహం లేదు.

19వ శతాబ్ది తెలుగు సాహిత్యచరిత్ర ఉషోదయ యుగంలో ఆ శతాబ్ది ఆరంభంలోనే ఛందోపరమైన నవ్యత సాధించిన మహాకవి రేవణూరి వేంకటార్యుని వృత్తంలో తురంగవల్గనం నడక కలిగి ఉందని ఈ ఛందస్సును తురంగవృత్తం అనడం ఔచిత్యమంతంగా ఎంతైనా సముచితమని డా॥ ఫణీంద్ర స్పష్టీకరించారు.

కవి కాలనిర్ణయంలో భిన్నాభిప్రాయాలున్నా, గురజాడ వారి ముత్యాలసరం ఛందస్సుకు, రేవణూరి తురంగవృత్తం 19వ శతాబ్ది ప్రథమాంకం నాటికే ఆద్యరూపంగా వెలసినట్టు డా॥ ఫణీంద్ర ధృవీకరించారు. చేమకూర వేంకటకవి అన్నట్టుగా నాటి సంస్కృత, తెలుగు ప్రాచీన కవులు వైదిక సంప్రదాయ అనుసర ణీయులుగా భాషలోనూ, భావాలలోనూ నవ్య ప్రయోగాలను ఈసడించటం, వ్యతిరేకించి ఆదరించకపోవడం కారణంగా, ఎంతో సాహిత్యం వెలుగుచూడని దౌర్భాగ్యం ఎదుర్కోవలసి వచ్చింది. 20వ శతాబ్దిలో నవ్యకవితా వైభవాన్ని






భాషలో, భావంలో సంతరించుకొన్న ఆధునిక నవ్య సాహిత్యానికి బీజాలు 19వ శతాబ్దిలోనే అంకురించి నూతన ఉషోదయం అవతరించిందనే అన్వేషణా పరిశోధనలో ఒక అంశంగా డా॥ ఆచార్య ఫణీంద్ర ముత్యాలసరంపై కొత్త వెలుగు ప్రసరింపచేసారు.

ఏ కవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం, దాని ప్రభావం, చారిత్రక పరిణామం తప్పవు. ఆ సామాజిక చారిత్రక పరిణామ గమనంలో కవి ప్రగతిశీలి, ప్రతిభాశీలిగా గమనాన్ని నిర్దేశించుకొంటాడు. మహాకవి గురజాడ (1861-1915)కు, రేవణూరి వేంకటార్యునికి కాలవ్యత్యాసం పరిశీలిస్తే, డా॥ ఫణీంద్ర పేర్కొన్నట్టుగా, గురజాడ కంటే వందేళ్ళకు పూర్వమే రేవణూరివారి తురంగవృత్తం ఆ కవి, సాహితీప్రతిభను వ్యక్తం చేస్తోంది. 1910లో గురజాడవారి ముత్యాలసరాలు వెలువడ్డాయి.

భూస్వామ్య నిరంకుశ ఆధిపత్యానికి గొడ్డలిపెట్టుగా ప్రభవించే వైతాళిక మహోదయానికి తెలుగు కవిత్వం మలుపు తీసుకుంది. 'పాత కొత్తల మేలు కలయిక క్రొమ్మెరుంగులు జిమ్మగా' ఆధునిక భావోత్తేజం, నాటి యువకవులను నడిపించింది. రేవణూరి వేంకటార్యుని వంటి కవుల నాటి కాలగతి, సంప్రదాయ ప్రాచీనతా భావవాహినికి ఒక అడ్డుకట్ట పడింది. గురజాడ జాడ సంపూర్ణ ప్రగతిశీల దృక్పథం. పూర్వ కవిత్వంలో వుండే వ్యర్థ పదాడంబరాలకు, స్వస్తిచెప్పి ఛందోనియమాలను పాటించాల్సిన అవసరం లేదని ఆధునికులను కొంత గురజాడ ఆలోచింపచేసారు. అయినా ఛందస్సును పూర్తిగా వదిలిపెట్టలేదు. 'ముత్యాలసరం-ఒక కృషి' 1935 ఫిబ్రవరి ఉదయినిలో శ్రీశ్రీ సుదీర్ఘ వ్యాసం రాసాడు. 'ఛందో బందోబస్తులన్నీ ఛట్‌ఫట్‌మని త్రెంచి' అంటూ తిరుగుబాటు ప్రకటించిన శ్రీశ్రీ తర్వాత కాలంలో కూడా సిరిసిరిమువ్వ వంటి ఛందోబద్ధమైన రచనలు చేసాడు.

20వ శతాబ్ది నవ్య కవిత్వయుగంలో మాత్రాగణాలతో వివిధ గతులలో గురజాడ, రాయప్రోలు, దేవులపల్లి, శ్రీశ్రీ, దాశరథి, ఆరుద్ర, సినారె వంటి మహాకవులు వెలార్చిన గేయఛందస్సులకు బీజం 19వ శతాబ్దిలోనే అంకురించిందని డా॥ ఆచార్య ఫణీంద్ర తన గ్రంథంలో పేర్కొన్నారు. 'రేవణూరి' వారి తురంగవృత్తాన్ని 'ముత్యాలసరం'గా స్వీకరించడం, గురజాడవారి ఆధునిక సాహిత్య లక్ష్య, లక్షణ కవితారూప ఉజ్జ్వల ప్రస్థానంలో నవ్య కవితా పరిణామంగా భావించాలి. నిజమే. రేవణూరి వేంకటార్యుని తురంగ వృత్తంలో ఛందో ప్రయోగం ప్రతిభావంతంగా కొనసాగింది. "శ్రీల నయ్యాల మేలుమంగకు జాలుబుయ్యాగ జాలురేణువు.. భూమి పాపట బ్రోనుగొల్పిన కామితార్పిత కామధేనువు" అంటూ

అలుమేలుమంగా దేవీ ఇతివృత్త ప్రస్తావన అద్భుతంగా వర్ణించబడింది. వేంకటార్యుడు సంకీర్తనాచార్య వాగ్గేయకార వంశస్థునిగా తన కావ్య రచనలో ఆధ్యాత్మిక భావ మాధుర్యాన్ని ఛందో యుక్తమైన తురంగ వృత్తంగా నడిపించారు. తెలుగు సాహిత్య కోశంలో పండితులు ఆయనను 16వ శతాబ్ది కవిగా భావించారు. లేదా 1750-1775 ప్రాంతంలో వాడైనా, రేవణూరి కవివరేణ్యుడు డా॥ ఫణీంద్ర సూచించినట్టుగా శ్రీపాద రేణు ప్రభావాన్ని 1810 ప్రాంతంలో రచించి ఉండవచ్చు. ప్రాచీన కవివరేణ్యునిగా ప్రాతఃస్మరణీయులు.

గురజాడకు, పాత ఛందస్సు అయిన తురంగ వృత్తానికి కొత్త పేరు పెట్టి నూతనత్వాన్ని భ్రమింపచేయవలసిన అవసరం, అగత్యం లేదు. తురంగ వృత్తం ఆయనను ఆకర్షించి ఉండవచ్చు. కొత్తగా మాత్రా ఛందస్సులో ముత్యాలసరం పేరిట, రాసినంత మాత్రాన పాతను కొత్తగా చేసి ఖ్యాతి పొందాలనే తపన, గురజాడ వంటి మానవోన్నతునికి మనం అంటకట్టలేం. ఎక్కడైనా, ఎప్పుడైనా

సందర్భానుసారంగా 'రేవణూరి' తురంగ వృత్తాన్ని గురించి, గురజాడ ప్రస్తావిస్తే సమయోచితంగానే వుండేది. బహుశా ఆయనకు అటువంటి ఆలోచన, తీరిక, వ్యవధి దక్కి వుండకపోవచ్చు. గురజాడ, కందుకూరి వంటి మహనీయ సంస్కరణవేత్తలు కేవలం కవిత్వంలోనే కాకుండా నాటి సమాజాన్ని, పాతుకుపోయిన దుష్ట మూఢ విశ్వాసాలను పారదోలే జీవితాశయంతో నవ్య కవితారీతులు, ప్రక్రియలను అన్వేషించి జన సామాన్యాన్ని కదిలించే వైతాళిక బాధ్యత నిర్వర్తించారు. ఏది ఏమైనా 19వ శతాబ్ది తెలుగు సాహిత్య చరిత్రను, క్షీణయుగం కాదు ఉషోదయ యుగంగా డా॥ ఆచార్య ఫణీంద్ర సాధించిన విస్తృత పరిశోధన ప్రశంసనీయం.




## నగలు

రమ్య: ఏమిటీ? రోజూ నా వెంట పడుతున్నారు? నేనంటే మీకు అంత ఇష్టమా?

కృష్ణ: అవును. చాలా చాలా ఇష్టం. మీరు ఒప్పుకుంటే పెళ్లి చేసుకుంటాను. మీరు ఒప్పుకోకపోతే చచ్చిపోతాను.

రమ్య: అయితే ఒక షరతు.

కృష్ణ: చెప్పండి. మీ కోసం నా ప్రాణమైనా ఇస్తాను.

రమ్య: మీ ప్రాణంతో నాకు పని లేదు. నాకు అవసరమైనప్పుడు నేను అమ్ముకోవటానికి మీ కిడ్నీ ఇవ్వాలి. అంతే!

– మా.శ్రీ.రాజు, పాల్వంచ

## రెండూ కాదు

భార్య: ఏమండీ! నేను అందమైనదానినని పెళ్లి చేసుకున్నారా? లేక తెలివైనదాన్నని పెళ్లి చేసుకున్నారా?

భర్త: అవి రెండూ కాదని తెలిసాకే పెళ్లి చేసుకున్నాను.

## చదివింది చాలు

భార్య: "ఏమండీ! మీరెలాగూ పెళ్లికి రాలేనంటున్నారుగా! నేనూ, బాబు వెళ్లొస్తాం. ఏమైనా చదివించమంటున్నారా?"

భర్త: అక్కర్లేదు. పెళ్లికూతురు, పెళ్లికొడుకు పెద్ద పెద్ద చదువులు చదివారట. మనం వాళ్లని చదివించాల్సిన అవసరం లేదు.

## కొత్త నగలు

భార్య: ఏమండీ! నిన్న మా కజిన్ పెళ్లికి వచ్చినప్పటి నుండి కడుపు నొప్పిగా ఉందండీ!

భర్త: పెళ్లికి వచ్చిన వాళ్లందరూ కొత్త కొత్త నగలు వేసుకున్నారా?

భార్య: మీకెలా తెలిసింది?

భర్త: నీకు కడుపునొప్పి అంటేనూ....

## ఉప్పు కర్రీ

భర్త: అబ్బా! కూరలో ఎవరైనా ఇంత ఉప్పు వేస్తారా?

భార్య: లేదండీ! ఈరోజు నేను చేసింది ఉప్పు మసాలా కర్రీ.

## బస్సు ఖరీదెక్కువ

భార్య: ఏమండీ! కారు తాళాలివ్వండి. కిట్టీ పార్టీకెళ్లాలి.

భర్త: పక్కనే వున్న హోటల్‌లో పార్టీకి వెళ్లేందుకు కారెందుకు?

భార్య: పది లక్షల కార్లో వెళ్తే దర్జాగా ఉంటుంది.

భర్త: అయితే బస్సులో వెళ్లు. ఇంకా దర్జాగా ఉంటుంది. బస్సు ఖరీదు ఇంకా ఎక్కువ.

## భ్రమ

"ప్రతిరోజూ నేను గంటల తరబడి అద్దం ముందు కూర్చుని నా అందాన్ని ఆస్వాదిస్తుంటాను. ఇదంతా నా అహంకారమంటావా?" అడిగింది స్నేహితురాల్ని, కనకమహాలక్ష్మి.

"అదంతా నీ భ్రమ" ఠక్కున జవాబిచ్చింది సౌభాగ్యలక్ష్మి.

## టీవీ సీరియల్స్

కామేశం డాక్టర్ వద్దకు వెళ్లాడు.

"ఏమైంది? ఏమిటి నీ ప్రాబ్లం?" అడిగాడు డాక్టర్.

"పొద్దస్తమానం నాకు నవ్వు వస్తూనే ఉంటుంది? ఏం చేయమంటారు డాక్టర్?"

"టీవీ చూసే అలవాటుందా?"

"కార్టూన్ చానల్స్ చూస్తుంటాను"



"అయితే అవి మానేసి సీరియల్స్ చూడు" సమాధానమిచ్చాడు డాక్టర్.

## ఈత

రమేశ్: నేను వెంటనే ఈత నేర్చుకోవాల్సిందేరా!

సురేశ్: ఎందుకు?

రమేశ్: నేను నీళ్లలో పడి కొట్టుకుపోతున్నట్టు రోజూ నాకు నిద్రలో కలలు వస్తున్నాయిరా!

# ‖ఔదార్యం‖

**కథ**

**అవంతి** రాజ్యాన్ని గుణశేఖరుడు పాలన చేస్తూ ఉండేవాడు, అతని మంత్రి పేరు సుబుద్ధి. ప్రజల జీవన విధానం గురించి స్వయంగా తెలుసుకోదలచిన గుణశేఖరుడు తన మంత్రితో



కలిసి మారువేషాలలో బాటసారుల్లా సిరిపురం అనే నగరం చేరారు. అక్కడ పూటకూళ్ళ ఇంటిలో భోజనం చేసి సమీపంలోని పెద్ద వేపచెట్ట నీడన విశ్రాంతి తీసుకోసాగాడు. మంత్రితో కలిసి అక్కడకు వచ్చిన వృద్ధుడు యాచన చేస్తు గుణనిధిని కూడా యాచన చేసాడు. యాచకుణ్ణి పరీక్షింపదలచిన రాజుగారు అతనికి కొంత ధనం ఇచ్చాడు. ఆ ధనం అందుకున్న వృద్ధుడు రాజుకు నమస్కరించి వేగంగా నడుస్తూ వెళ్లసాగాడు.

యాచకుణ్ణి రాజుగారు, మంత్రి అనుసరించసాగారు.

అలావెళ్ళిన వృద్ధుడు నగర పొలిమేరలో జరుగుతున్న సంతలోకి వెళ్ళి అక్కడ పంజరాలలో బంధించబడి ఉన్న పక్షులను అన్నింటిని బేరం ఆడసాగాడు. తను యాచన చేస్తూ జీవించే వృద్ధుడు ఆ పక్షులతో ఏం చేయబోతున్నాడో అర్థంకాని రాజుగారు అతనికి చేరువగా ఉన్న చెట్టు వెనుక నుండి గమనించసాగారు. ముందుగా యాచకుడు కుందేళ్ళను కోనుగోలు చేసి వాటిని అక్కడ ఉన్న పొదలలో వదిలివేసాడు. అతని చేష్టలు అర్థంకాని రాజు, మంత్రి చూస్తూ ఉండిపోయారు. కుందేళ్ళకు స్వేచ్ఛ కలిగించిన వృద్ధ యాచకుడు మళ్లీ పక్షులు అమ్మే అతని వద్దకు వచ్చి ధనం చెల్లించి అతని వద్ద ఉన్న పక్షులన్నింటిని పంజరాల నుండి విడుదల చేసి గాల్లో ఎగురవేసాడు.


యాచకుడై ఉండీ సంపాదించిన ధనం పరోపకారానికి వినియోగిస్తున్న అతన్ని మెచ్చుకునా రాజు "తాతా, సాటి ప్రాణులు కూడా స్వేచ్ఛగా బతకాలనే నీ ఆశయం మెచ్చుకోదగింది. నిన్ను అభినందిస్తున్నా" అన్నాడు రాజు.

"లోకానికి వినియోగపడని ధనం, విద్యా వృథా. మన దగ్గర ఉన్న ధనంతో సమాజ హితమైన పనులు చేయాలి, పది మందికి బతుకుతెరువు కలిగేలా చేయాలి. అంతేకాని ఆ ధనం ఇంట్లో దాచుకుంటే ప్రయోజనం ఏముంటుంది? విద్య కూడా అంతేకదా! మనం నేర్చిన విద్య, కళ ఏదైనా ఎదుటి వారికి వినియోగపడకపోతే వృథానే కదా" అన్నాడు వృద్ధ యాచకుడు.

యాచకుడు జీవితాంతం సుఖంగా గడిపేలా రాజు అన్ని ఏర్పాటు చేస్తూ, వన్యప్రాణుల వేట నిషేధించాడు.

**- బెల్లంకొండ నాగేశ్వరరావు,** చెన్నయ్

## రంగులు వేయండి







## బాలగేయం

### బంధాలు

అమ్మ అమ్మ అమ్మమ్మ
చక్కగ చూసే
చిలకమ్మ
నాన్న అమ్మ
నాన్నమ్మ
ముద్దుగ చూసే
మురిపెమ్మ
అమ్మ అక్క
పెద్దమ్మ
తన బిడ్డలానే
చూచునమ్మ
నాన్న అక్క
అత్తమ్మ
ప్రేమకు తను
మరో రూపం

అమ్మ నాన్న
తాతయ్య
కథలెన్నో విప్పి
చెప్పేనయ్యా
అమ్మ అన్న
మామయ్య
ఊరంత ఎత్తుకు
తిప్పేనయ్యా

నాన్న నాన్న
తాతయ్య
తినబండారాలెన్నో
తెచ్చేనయ్యా
నాన్న అన్న పెద్దయ్య
ముద్దుముద్దుగ
చూసేనయ్యా.

–తిప్పాన హరి రెడ్డి
విజయవాడ

## హాలో ఫ్రెండ్...



చిన్నారుల ప్రశ్నలకు
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**


## గిరీష్ అంకుల్ సమాధానాలు

**ఎస్.కార్తికేయన్,** సూర్యాపేట

**ప్రశ్న: కుంభమేళా, పుష్కరాల్లో పాల్గొనేవారి సంఖ్యను ఎలా లెక్కిస్తారు?**

**జవాబు:** పుష్కరాలు, కుంభమేళా సందర్భాలలో నదిలో స్నానం చేసిన వారిని లెక్కించేందుకు ఒక శాస్త్రీయ విధానం లేకపోలేదు. ఉదా॥ ఒక ఘాట్ వంద మీటర్లు వెడల్పు, 75 మీటర్లు పొడవు వుందనుకుందాం. నీళ్లు వున్న ప్రాంతమే కాకుండా, మెట్లు, ప్లాట్‌ఫామ్ మొత్తం కలిపి ఈ కొలతల్లోనే ఇమిడి వుంది. ఒక్క స్క్వేర్ మీటర్‌కు నలుగురు వ్యక్తులు నిలబడేందుకు సౌకర్యంగా ఉంటుంది. అంటే ఈ ఘాట్‌లో ఒక్కసారిగా 12,500 మంది యాత్రికులు సౌకర్యవంతంగా నిలబడే అవకాశం ఉందన్నమాట. ఒక గంటకు సగటున ఇటువంటి నాలుగు బ్యాచ్‌లు స్నానం చేసి, ఘాట్ వెలుపలికి వెళ్లిపోతారని లెక్కిస్తారు. అంటే ఒక గంటకు 50 వేల మంది యాత్రికులు స్నానం చేస్తారని నిర్ధారిస్తారు. ఇది ఈ స్నాన ఘట్టం పూర్తి సామర్థ్యంగా నిర్ణయిస్తారు. సాధారణంగా ఘాట్ ఎన్ని గంటల పాటు యాత్రికులు స్నానం చేసేందుకు తెరచి వుంటుందన్న విషయం పరిగణలోకి తీసుకుంటారు. ఒక గంటసేపు శుభ్రపరిచేందుకు ఘాట్‌ను మూసి వేస్తుంటారు. అంటే 23 గంటలు తెరిచి వుంటే ఆ రోజు 11.5 లక్షల మంది యాత్రికులు స్నానం చేసే అవకాశం ఉంటుంది. కానీ రోజు మొత్తం మీద యాత్రికుల రాకపోకలు ఒకే విధంగా ఉండదు. తెల్లవారుఝామున అధిక సంఖ్యలో వచ్చే యాత్రికులు 9 గంటల నుంచి తగ్గిపోతారు. అప్పుడు గంటకు 10 వేల మంది యాత్రికులు వచ్చే అవకాశం ఉంటుంది. అదే విధంగా మధ్యాహ్నం యాత్రికుల సంఖ్య పలుచగా వుంటుంది. అప్పుడు గంటకు ఆరేడు వేల మంది మాత్రమే స్నానం చేసే అవకాశం ఉంటుంది.

ఈ విధంగా యాత్రికుల రాకపోకలను అనుసరించి ప్రతి గంటకు ఎంత మంది స్నానం చేస్తున్నారో ఘాట్ ఇన్‌చార్జి లెక్కిస్తారు. ఇదే విధంగా అన్ని స్నాన ఘట్టాల్లోని ఇన్‌చార్జిలు పూర్తి సామర్థ్యాన్ని లెక్కించి యాత్రికుల రద్దీని అనుసరించి అంచనాలు రూపొందిస్తారు. ఈ విధంగా అన్ని ఘాట్‌ల నుంచి లెక్క గట్టి తమ జోనల్ అధికారి సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు వివరాలు అందిస్తారు. ఆ తర్వాత అధికారులు ఆ సంఖ్యను అధికారికంగా ప్రకటిస్తారు.







# రైజింగ్ స్టార్

బుగ్గన మధుసూదనరెడ్డి

**సఫారీ జట్టుతో జరిగిన టైటిల్ పోరులో మన భారత అమ్మాయిల జట్టుదే పై చెయ్యి అవ్వడం హర్షణీయం.**

కౌలాలంపూర్ వేదికగా జరిగిన ఫైనల్లో నికీ ప్రసాద్ నేతృత్వంలోని అమ్మాయిల జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా జట్టును చిత్తు చేసి రెండోసారి మన భారత అమ్మాయిల జట్టు అండర్ 19 టీ 20 విశ్వ కప్ గెలిచి ఒక గొప్ప, సరికొత్త చరిత్రకు అంకురార్పణ గావించింది. ముఖ్యంగా ఈ టోర్నమెంట్ ఆద్యంతం ఓటమి అనేదే లేకుండా మన భారత మహిళల జట్టు ఏకంగా 7 మ్యాచ్‌లలో విజయ దుందుబి మోగించడం ఒక గొప్ప విశేషం. అన్నింటికి మించి తెలంగాణ ఆల్ రౌండర్, రైజింగ్ స్టార్ గొంగడి త్రిష కేవలం 7 మ్యాచుల్లో 309 పరుగులు సాధించడం అందులో ఒక సెంచరీతో కలుపుకొని ఈ టోర్నీలో టాప్ స్కోరర్‌గా నిలువడమే కాదు ఏకంగా 'ప్లేయర్ అఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డులు సైతం గెలుచుకోవడం గొంగడి త్రిషకే చెల్లింది. అదేమాదిరి కచ్చితంగా గెలవాల్సిన ఈ ఫైనల్స్ మ్యాచ్ కీలక పోరులో గొంగడి త్రిష ఓ ఛాంపియన్ ఆటతీరును కనబరచి అటు బౌలింగ్‌లో 15 పరుగులకు 3 వికెట్లు సాధించి ఇటు బ్యాటింగ్‌లో 33 బంతుల్లో 44 నాటౌట్, 8 ఫోర్లు) చేసి భారత అమ్మాయిల జట్టు ఈ విశ్వ కప్ టైటిల్ నెగ్గడంలో తన వంతుగా అమోఘమైన పాత్రను పోషించింది గొంగడి త్రిష అనే మాట అక్షర సత్యం.

అదే విధంగా 2023లో షఫాలీ వర్మ సారథ్యంలో భారత అమ్మాయిల జట్టు అండర్ 19 ప్రపంచ కప్ నెగ్గిన జట్టులో సైతం గొంగడి త్రిష ఉన్నప్పటికీ షఫాలీ వర్మ, రిచా ఘోష్ వంటి సీనియర్ ప్లేయర్ల ఆ టోర్నమెంట్‌లో జట్టులో ఉండటంతో అంతగా అవకాశాలు చేజిక్కించుకోలేని త్రిష ఈ మారు మాత్రం తనకు వచ్చిన బంగారు అవకాశాన్ని రెండు చేతులా ఒడిసి పట్టుకొని మరీ ఒక స్ఫూర్తిదాయకమైన, దేశమే గర్వించదగ్గ ఆటతీరును కనబరచి అందరిచే శెభాష్ అనిపించుకుంది ఈ యువ క్రీడాకారిణి గొంగడి త్రిష అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఏది ఏమైనా భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ఆటను ఇష్టపడే ఈ రైజింగ్ స్టార్ గొంగడి త్రిష సీనియర్ జట్టులోను అవకాశం దక్కితే ఇదే మాదిరి రాణించేందుకు సిద్ధంగా వున్నానని ఎనలేని ఆత్మవిశ్వాసాన్ని



కనబరచుతుండటాన్ని బట్టి రాబోయే రోజుల్లో భారత మహిళల సీనియర్ జట్టులో స్థానం సంపాదించుకొని తన చిరకాల కలను సాకారం చేసుకోవాలని అశేష భారత క్రికెట్ అభిమానులం అయిన మనమంతా మనసా, వాచా, కర్మణా కోరుకుందాం.

"కృషితో నాస్తి దుర్భిక్షం" అనే మాటకు మరో పర్యాయ పదంగా, ప్రబల నిదర్శనంగా నిలిచిన ఈ అత్యంత ప్రతిభావంతమైన, ఆణిముత్యం లాంటి ఈ మహిళా క్రికెటర్ గొంగడి త్రిషకు ముున్ముందు భారత మహిళ క్రికెట్ రంగంలో ఎంతో ఉజ్వల, బంగారు భవిష్యత్ ఉందనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు.

ప్రేమ సులభమైనది, అదొక అగ్ని ప్రవాహం. దానిలో మునిగి ప్రవహించాలి.

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

*sunmagvaartha@gmail.com*

# మహిళాభివృద్ధే మానవాభివృద్ధి

నేదునూరి కనకయ్య

మహిళలు ఆకాశంలో సగం దేశ జనాభాలో సగభాగమున్న మహిళలు పురుషులు సమానమేనని భారత రాజ్యాంగం చెబుతోంది. సమాన అవకాశాలు కల్పిస్తామని పాలకులు తరచూ చెప్తుంటారు కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదికలో తేలింది. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే సమానత్వం కోసం మహిళలు వందేళ్లు నిరీక్షించాలనీ, అంతే కాకుండా స్త్రీ పురుష అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. 2006 నుంచి పోలిస్తే ఈ యేడాది స్త్రీ, పురుషుల అసమానతలు పెరిగాయని ప్రపంచ ఆర్థిక ఫోరం తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా 144 దేశాల్లోని విద్య, వైద్య, రాజకీయ, ఆర్థిక విషయాల్లో మహిళల భాగస్వామ్యం అధ్యయనం చేసి వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమగ్ర నివేదికను రూపొందించింది. మగవాళ్ళకు వున్న అవకాశాల్లో స్త్రీలకు కేవలం 68 శాతం మాత్రమే ఉన్నాయని నివేదిక తెలిపింది. విద్య ఆరోగ్య విషయంలో మహిళల పరిస్థితి కొంత మెరుగ్గానే ఉంది కానీ ఆర్థిక రాజకీయ విషయాలు ఆశించినంతగా మెరుగుపడలేదు.

## స్త్రీ, పురుష మధ్య అసమానతలు, వ్యత్యాసాలు

ఫిన్లాండ్, ఐస్లాండ్, స్కాండినేవియా దేశాలు స్త్రీ పురుష సమానత్వంలో ముందున్నాయి. ఐస్లాండ్‌లో స్త్రీ పురుష అసమానతలు 12 శాతం మాత్రమే వుంది. మొదటి 5 దేశాల్లో నార్వే, ఫిన్లాండ్, స్వీడన్ నిలిచాయి. రువాండాలో ప్రతి ఐదుగురు ఎంపిలలో ముగ్గురు మహిళలు వున్నారు. మధ్య ప్రాచ్యం ఉత్తరాఫ్రికాలోని మహిళలు ఎక్కువ వివక్ష ఎదుర్కొంటున్నారు. సమానత్వ విషయంలో యేమన్ చాలా వెనుకబడి వుంది. 2023 నివేదిక ప్రకారం 146 దేశాల్లో మన దేశం 127వ స్థానంలో వుంది.



వరల్డ్ బ్యాంక్ రిపోర్ట్ ప్రకారం దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో ప్రతి 11 మంది అమ్మాయిల్లో చదువుకున్నవారు ఒకరు మాత్రమే ఉన్నారని తేలింది. నాడు 9 శాతం వున్న స్త్రీల అక్షరాస్యత ఇప్పుడు 77 శాతానికి చేరింది. అఖిల భారత ఉన్నత విద్యా సర్వే 2020 2021 ప్రకారం దేశ వ్యాప్తంగా కళాశాలల్లో యూనివర్సిటీలలో చేరే అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. 2019-2020లో 1.8 కోట్ల మంది విద్యార్థినులు ఉన్నత విద్యా కోర్సుల్లో చేరగా 2020-2021 నాటికి వారి సంఖ్య 2.1 కోట్లకు పెరిగింది. అయినప్పటికీ దేశ వ్యాప్తంగా సాంకేతిక ఇంజనీరింగ్ కోర్సుల్లో(30శాతం), మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేసే అమ్మాయిల సంఖ్య (40 శాతం) నమోదు అయినట్లు అఖిల భారత ఉన్నత విద్య సర్వే వెల్లడించింది.

## శ్రామిక శక్తి మహిళా వాటా

దేశంలో శ్రామిక శక్తిలో మహిళా వాటా 2018-2019లో దేశ శ్రామిక శక్తిలో గ్రామీణ మహిళల భాగస్వామ్యం 19.7 శాతం ఉండగా 2020-2021 నాటికి 27.7 శాతానికి చేరింది. దేశంలో జరిగే పలు రకాల ఆర్థిక కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం ఆశించిన విధంగా లేదు. కొన్ని రంగాల్లో మహిళలు స్వశక్తితో ఎదుగుతున్నప్పటికీ, ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ పేద మధ్య తరగతి మహిళలు ఉన్నత స్థాయికి చేరుకోలేకపోతున్నారు. ఆసక్తి, ప్రతిభ వున్నప్పటికీ ఆర్థిక కార్యకలాపాల్లో వారి భాగస్వామ్యం అల్పంగా వుంది.

## లింగ వివక్ష

భారత్‌దేశంలో స్త్రీ, పురుష అసమానతలు లింగ వివక్ష రూపుమాపితే 2025 నాటికి భారత దేశ ఆర్థిక వ్యవస్థలో స్థూల జాతీయ ఉత్పత్తికి అధనంగ 77 వేల కోట్ల డాలర్లు చేకూరుతాయని గతంలో మెకెన్సీ గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో వెల్లడైంది. ఇది పాలకులకు కనువిప్పు కావాలి. మహిళాభివృదికి ప్రభుత్వం సంస్థాగత సంస్కరణలు, మార్పులు, పాలనా పరమైన మార్పులు చేపట్టాలి. ఆడపిల్లలను భారంగా భావించే మానసిక స్థితి నుండి సమాజం బయట పడాలి. కుటుంబంలో మగ పిల్లలు, ఆడపిల్లలు అన్న వివక్ష చూపకుండా సమానత్వాన్ని పాటించాలి. ఆడపిల్ల'ఆడపిల్లే' అన్న సామాజిక వాతావరణాన్ని సమూలంగా మార్చాలి. దేశ ప్రగతికి మహిళా లోకం చోదక శక్తిగా ఎదగటానికి మహిళలు పనిచేసే చోట విద్యాలయాల్లో, బహిరంగ ప్రదేశాల్లోనూ మహిళలకు సురక్షిత వాతావరణాన్ని కల్పించాలి. మహిళా హక్కుల రక్షణ భరోసా, భద్రత కల్పించాలి. మహిళ మీద జరిగే అత్యాచారాలు దాష్టికాలు అరికట్టడానికి సత్వర విచారణ చేపట్టి బాధితులను శిక్షించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి. సమాజాన్ని పితృస్వామిక వ్యవస్థ నుండి విముక్తి చేయడానికి మహిళా సంఘాలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, లింగ సమానత్వం మీద చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి. పాఠ్యాంశాల్లో లింగ వివక్షత అంశాలను తొలగించాలి. మహిళా సాధికారిత విద్యావకాశాలు అభివృద్ధి వ్యూహాలను సమస్యలను పరిశోధన చేయడానికి అమ్మాయిలను ప్రోత్సహించాలి.

సమాన పనికి సమాన వేతన చట్టాలను అమలు చెయ్యాలి. పారిశ్రామిక సేవా రంగాల్లో ఔత్సాహిక మహిళను ప్రోత్సహించడానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించాలి. మహిళాభివృది కేంద్రంగా వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలలో అభివృధి వ్యూహాలను అమలు చేసినపుడు మాత్రమే మహిళాభివృధి జరిగి మహిళా ఆర్థిక సాధికారత సాధ్యమవుతుంది.

# అమెరికా యోగం

కథ

దేగల అనితాసూరి



**"ఇక పైన నేను కిట్టి పార్టీలకు వెళ్తానేమో చూడండి. అబ్బబ్బబ్బా! ఆ పొగడ్తలేంటి? ఎవరో వి.ఐ.పి. వచ్చినట్టు ఉన్నట్టుండి ఆ మర్యాదలేమిటి? కొత్తొక వింత, పాతొక రోతని ఊరికినే అన్నారా పెద్దవాళు.." ఇంట్లోకి వచ్చీరాగానే పెట్టుకెళ్ళిన నగలు తీసి దేని బాక్సుల్లో వాటిని సర్దిస్తూ విసురుగా భర్తతో అంది కామాక్షి.**

"ఏమైందేమిటి?" అడిగాడు పరాంకుశం సెల్ ఫోన్లోంచి ముఖం పక్కకు తిప్పి,

"ఆ సెకండ్ ఫ్లోర్ రమణి కొడుక్కి అమెరికాలో ఉద్యోగం వచ్చిందట. అంతే! అందరూ తననో సి.ఎంనో, పి.ఎంనో చూసినట్టు ఫీలైపోతున్నారు తెల్సా? నాకైతే ఒళ్ళు మండిపోయిందనుకోండి" అంది.

"రోలు రోకలితో మొరపెట్టుకున్నట్టుంది నువ్వొచ్చి నాతో చెప్పడం.. అసలే మా ఆఫీసులో నా కొలీగ్స్ కూతుళ్ళు, అల్లుళ్ళు, కొడుకులు అంటూ అందరి పిల్లలూ అమెరికాలోనే ఉన్నారు, అదంతా ఒకెత్తనుకుంటే, మొన్నటికి మొన్న మా అటెండరు వేణుగాడి కొడుక్కి కూడా అమెరికాలో జాబొచ్చి వెళ్ళిపోయాడు తెల్సా? మొత్తానికి నా ఫ్రెండ్స్ సర్కిల్లో మనవాడు తప్ప అందరి పిల్లలూ స్టేట్స్‌లోనే అఘోరించారు. నువ్వొచ్చి పుండు మీద కారం రాసినట్టు అదే సంగతి నాతో చెప్తున్నావ్" ఉడుక్కుంటూ అన్నాడు పరాంకుశం, కామాక్షి ఇచ్చిన పొగలు కక్కే కాఫీని ఊదకుండానే తాగేస్తూ.

ఇంతలో రెండు చెవులకి ఇయర్ ఫోన్స్ తగిలించుకుని, వీపుకి బ్యాగొకటి వేసుకుని వచ్చాడు ఇరవై మూడేళ్ళ ఆదేశ్. ఇంట్లోకి రావటం రావటమే సోపాలో వాలిపోయి ఫోన్‌లో వాట్సప్, ఫేస్ బుక్‌లు ఓపెన్ చేసి చూసుకుంటూ, ఏవో మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తూ అసలు తనకో ఇల్లుందని, తల్లి, తండ్రి అనే మరో రెండు ప్రాణులు కూడా తనతో కలిసుంటారని గ్రహించే స్థితిలో లేనట్టున్నాడు.

కామాక్షి బూస్ట్ కలుపుకొచ్చి కొడుక్కిచ్చింది. రోబోలా.. కీ ఇచ్చినట్టు ఆటోమేటిగ్గా అందుకుని తాగేసి, గ్లాసు టీపాయ్ మీద పెట్టేసి ట్రాన్స్‌లోని మనిషిలా లేచి తనగదిలో కెళ్ళిపోయాడు ఆదేశ్. అలా వెళ్తున్న అతన్ని చూసి కూడా కామాక్షి, పరాంకుశంలు తమ కొడుకు నేర్చుకుంటున్న కంప్యూటర్ కోర్సులంటే మాటలా? వాడింకా అదే ధ్యాసలో జావాలూ, కోవాలూ ఫ్రెండ్స్‌తో కలిసి అధ్యయనం చేస్తూ అలసిపోతుంటే తాము పలకరించి తపోభంగం కలిగించకూడదన్నట్టు వాడు గదిలోకెళ్ళే వరకూ సైలెంట్‌గా అయిపోయారు!

...........

ఎప్పుడూ లేంది ఆరోజు పెందలాడే నిద్ర లేదాడు ఆదేశ్. స్నానం ముగించి తయారై హాల్లోకి వచ్చేసరికి, పెద్దకొడుకు దగ్గర తన వంతు ఆరునెల్ల వ్యవధి ముగియటంతో బయలుదేరి వచ్చేసిన నాయనమ్మ మహాలక్ష్మి, పరాంకుశంతో కలిసి రావటం కనిపించింది.

"కామాక్షీ..! అమ్మకు కాఫీ కలుపు, లగేజీ లోపల పెట్టిస్తా" అన్నాడు ట్రంకుపెట్టెను పట్టుకెళ్ళి గదిలో పెడుతూ.

"ఏంటి నానమ్మా.. బాగా ఒళ్లు చేసినట్టున్నావ్?" కావాలనే నానమ్మను ఉడికిస్తూ అన్నాడు ఆదేశ్ ఇడ్లీలు నోట్లో కుక్కుకుంటూ.

"అవునా.. అక్కడ మీ పెదనాన్న కొడుకులు ఒకడు అమెరికాలో, ఇంకొకడు సింగపూర్‌లో వున్నారు కదా! ఆ సంతోషంతో ఈసారి నన్ను కూడా అమెరికా తీసుకెళ్తానన్నాడ్రా మీ అన్న. అన్నట్టు రేపు మీ పెద్దమ్మ. పెదనాన్నలు వెళ్తున్నారు తెల్సా? వీసానో, విసనకర్రోగానీ వస్తే నన్ను తీస్కెళ్తాడట" ముఖం చాటంత చేసుకుని చెప్పింది మహాలక్ష్మి తన ఆస్తి మీద చూపిస్తున్న ప్రేమను తన మీదనుకుని భ్రమిస్తూ.

"సర్లే సర్లే, నేనిప్పుడు జాబ్ కోసం "ఇంటర్వ్యూకెళ్తున్నా వస్తా మరి" చార్జ్‌లో పెట్టిన స్మార్ట్ ఫోన్ తీసి ప్యాంట్ జేబులో పెట్టుకుంటూ అన్నాడు ఆదేశ్.

"అవునా? ఏది? అమెరికా ఉద్యోగమేనా?" కళ్ళు పెద్దవిచేసి ముఖం తిప్పుతూ అడిగింది మహాలక్ష్మి,

"ఈ తాయెత్తు కట్టుకుని ఇంటర్వ్యూకెళ్లు. ఇమ్మీడియెట్‌గా నీకు అమెరికా ఉద్యోగమే వస్తుంది" దేవుని గదిలో పెట్టిన చిలుకూరు "వీసా" బాలాజీ గుళ్ళో పూజ చేయించి తెచ్చిన తాయెత్తు పట్టుకుని కంగారుగా పరుగెట్టుకొచ్చింది కామాక్షి అత్తగారి కోసం పెడ్తున్న కాఫీగిన్నె అడుగంటుతున్నా అలాగే వదిలేసి.

"అబ్బా..! ఆపుతారా మీ అమెరికా గోల. ముందు ఏదో ఒక కంపెనీలో జాబ్ వచ్చాక, కంపెనీవాళ్ళే పంపుతార్ట స్టేట్స్‌కి" అన్నాడు ఆదేశ్ విసుక్కుంటూ.

"నా పెద్దమనవళ్ళిద్దరికీ కూడా నేను అక్కడున్నప్పుడే విదేశాల ఛాన్సులొచ్చాయి. ఇలా వచ్చానో లేదో వాడు అమెరికా ఉద్యోగానికి ఇంటర్వ్యూకెళ్తున్నాడంటే ఏమిటర్థం? నా అడుగు పడిందంటే ఇక అమెరికా అయినా వచ్చి ఇండియా మీద వాలిపోవాల్సిందే" తన లెగ్గు మహత్యాన్ని అతిగా చెప్తూ పొంగిపోయింది మహాలక్ష్మి.

ఆఫీసుకి వెళ్తున్న పరాంకుశం ధ్యాసంతా ఇందాక తల్లి అన్న మాటల పైనే వుంది. చివరకు ఎనభయ్యేళ్ళొచ్చిన తల్లి కూడా అమెరికా వెళ్ళబోతున్నా నంటోంది. ఇంతకీ.. ఆదేశ్‌కి అమెరికా యోగం వుందో, లేదో! అన్న ఆలోచన. వచ్చిందే తడవుగా నడుపుతున్న కారుని ట్యాంక్ బండ్ పక్కనే ఆపేసి, అక్కడున్న ఓ చిలక జ్యోతిష్యుడితో తన కొడుక్కి అమెరికా యోగం వుందో, లేదో చెప్పమన్నాడు.

పొద్దుటే మంచి బేరం తగిలిందని సంతోషించి, కార్డులన్నీ పరిచి బోనులోని చిలకను పిలిచాడు.

చిలుక నెమ్మదిగా బయటకొచ్చి కొన్ని కార్డుల్ని ముక్కుతో అటూ ఇటూ తీసి పడేసి, చివరికో ముక్క తీసి అతని చేతికిచ్చి మళ్ళీ పంజరం లోపలికి వెళ్ళిపోయింది.

ఆ కార్డును సాలోచనగా చూస్తూ "వెంకటేశ్వరస్వామి వచ్చాడు. అంటే పట్టిందల్లా బంగారమే, గొప్పవాడవుతాడు. అయితే, అమెరికా వెళ్ళడానికి మాత్రం ఒక పూజ చెయ్యాలి" అంటూ నోటికొచ్చిందేదో చెప్పాడు.

అంతవరకూ మంత్రాలు, చింతకాయలు అంటూ కొట్టిపారేసిన పరాంకుశానికి ముదిరిపోయిన అమెరికా పిచ్చితో, పూజకు డబ్బులిచ్చి లేచాడు విమానమెక్కకుండానే తన కొడుకు మంత్రం వేసినట్టు అమెరికాలో వాల్తాడని భావిస్తూ.

హైదరాబాద్‌లో పేరున్న మంచి కంపెనీలో ఇంటర్వ్యూకెళ్తే, సబ్జెక్ట్ అయ్యాక హైదరాబాద్‌లో కాకుండా బెంగళూర్‌లో ఉన్న ఆఫీస్‌కి అపాయింట్ మెంట్ ఇచ్చారు. రిటైర్‌మెంట్ తర్వాత అపార్ట్‌మెంట్ తీసుకుందాం. అంతవరకూ ఫ్రెండ్స్‌తో కలిసి వుండమన్నారు పరాంకుశం, కామాక్షి ఆదేశ్‌ని వదల్లేక వదుల్తూ.

ఆదేశ్‌కి ఉద్యోగం వచ్చి సంవత్సరం గడిచిపోయింది. పరాంకుశం, కామాకి త్వరలో హైదరాబాద్‌లోని తమ పోర్షన్ ఖాళీ చేసి రెంట్‌కిచ్చేసి పర్మనెంట్‌గా బెంగళూర్ వెళ్ళిపోదామనుకునేంతలో ఎప్పట్నుంచో కళ్ల కాయలు కాచేలా ఎదురు చూసిన అమెరికా అవకాశం వున్నట్టుండి హఠాత్తుగా వచ్చింది.

ఏమైతేనేం మొత్తానికి ఏ తాయెత్తో, కుంకుమో బాగానే పనిచేసి కొడుక్కి అమెరికా అవకాశం వచ్చింది. అంతే చాలనుకుని కొడుకు అడిగినవన్నీ సమకూర్చి ఫ్లైట్ ఎక్కిందారు. ఈలోపు మహాలక్ష్మిని ఓ నెలరోజుల పాటు అమెరికా తీసుకెళ్ళి తిప్పి, తెలిసిన వాళ్ళతో ఇండియాకు పంపేశాడు పెద్ద మనవడు ఆమె చివరి కోరిక తీర్చేసి.

"దేవుడి దయవల్ల యిన్నాళ్ళకు మనవాడూ అమెరికా వెళ్ళే అదృష్టం పట్టిందండీ" మురిసిపోతూ అంది కామాక్షి .

ఇప్పుడు ఒక్క కిట్టీ పార్టీ, పెళ్ళి, పేరంటం, గృహప్రవేశం లాంటి ఏ సందర్భాన్నీ వదులుకోవటం లేదు కామాక్షి. అడిగిన వాళ్ళకు, అడగని వాళ్ళకు అందరికీ ఒకటే డప్పు వాయించి వస్తోంది "మా అబ్బాయి అమెరికా వెళ్ళాడు. త్వరలో మేమూ వెళ్ళబోతున్నాం" అంటూ.

పరాంకుశం ఏమీ తక్కువ తినలేదు. రిటైరైపోయినా సరే డిస్పెన్సరీలో మందులు తెచ్చుకోడానికో, ఆఫీసు బ్రాంచిలోని బ్యాంకులో డబ్బులు డ్రా చేయటానికో అన్నట్టు వెళ్ళి అందరితో తన పుత్రరత్నం అమెరికా అధ్యాయం గురించీ చిలవలు పలవలుగా చెప్పి ఊదరగొట్టసాగాడు. వాళ్లంతా "తొందరగా ఈయన అమెరికా వెళ్తే బాగుండు. ఇండియాలో మాకీయన నస్సైనా తప్పుతుందిరా స్వామీ" అని మనసులోనే కోరుకోసాగారు.

............

కొడుకు అమెరికా వెళ్ళిన ఆనందంతో మొక్కులు, అందరికీ చెప్పడాలు అన్న కార్యక్రమంలో పడి వాళ్ళు గమనించని విషయం ఏమిటంటే, ఆదేశ్ మొదట్లో రోజుకు ఒక్కసారైనా ఫోన్ చేసేవాడు. రాన్రానూ బిజీ అని, రాత్రుళ్ళు కూడా మీటింగులుంటాయని చెప్పి వారానికి రెండుసార్లే పలకరిస్తున్నాడు. తరువాత్తర్వాత వారానికి ఒక్కసారి, ఇంకా మర్చిపోతే తల్లో తండ్రి కాల్ చేస్తే ముక్తసరిగా మాట్లాడి పెట్టేయడం చేయసాగాడు. ఆదరా బాదరాగా హైరానా పడ్తూ కామాక్షి , పరాంకుశాలు తెచ్చి జాగ్రత్త చేసుకున్న వీసాలు భద్రంగా బీరువాలోనే మూలగసాగాయి.

కాలచక్రం మూడేళ్ళు గిర్రున తిరిగిపోయింది. ఈ మధ్యలో మహాలక్ష్మి కూడా కాలం చేసింది. వీడియో కాల్‌లో రెండు ఓదార్పు మాటలు చెప్పాడు ఆదేశ్. తర్వాత కనీసం మాటల మధ్యలో కూడా నాయనమ్మను తలుచుకోలేదు. ఒకరోజు ఉదయాన్నే వాట్సప్‌లో "అమ్మా, నిన్ను చూడాలని వుంది. ఇమ్మీడియట్‌గా వచ్చేయ్. అక్కడ కొన్ని పనులున్నాయ్. అవి చూసుకున్నాక నాన్నను రమ్మందాం. నువ్వు వారంలోగా బయలుదేరు" అంటూ మెసేజ్ పెట్టాడు ఆదేశ్.

తామెన్నో ఆశలు పెట్టుకున్న తమ కొడుకు మారిపోయాడని, చాలా మంది పిల్లల్లాగే పట్టించుకోకుండా వదిలేశాడని చివరి నిర్ధారణకు వచ్చేయబోతున్నంతలో వచ్చిన ఆ మెసేజ్ చూసి ఇద్దరూ సర్వం మర్చిపోయారు. కొడుక్కి ఇష్టమైన పచ్చళ్ళు, పొళ్ళు అంటూ అన్నీ సిద్ధం చేసుకుని బయలుదేరింది. పరాంకుశం దగ్గరుండి ఆదేశ్ స్నేహితుడు వెళ్తుంటే, అన్ని జాగ్రత్తలూ చెప్పి కామాక్షిని వీడలేక వీడుతూ భారమైన

ఆఫీసుకి వెళ్తున్న పరాంకుశం ధ్యాసంతా ఇందాక తల్లి అన్న మాటల పైనే వుంది. చివరకు ఎనభయ్యేళ్ళొచ్చిన తల్లి కూడా అమెరికా వెళ్ళబోతున్నా నంటోంది. ఇంతకీ.. ఆదేశ్‌కి అమెరికా యోగం వుందో, లేదో! అన్న ఆలోచన.

హృదయంతో బైబై చెప్పి చెమర్చిన కళ్ళతో ఇల్లు చేరాడు. విమానం ఎక్కిందన్న మాటేగానీ కామాక్షి పరిస్థితి కూడా అలాగే వుంది. పెళ్లయ్యాక తామిద్దరూ ఇంతవరకూ ఒకర్ని విడిచి ఒకరు వున్నదేలేదు. అలాగే ఆదేశ్‌ని కూడా. ఎప్పుడూ హాస్టల్లోనూ వేయలేదు. ఇద్దరూ కలిసి వెళ్ళుంటే ఇంత బాధ వుండేది కాదుకదా అని నీళ్ల నిండిన కళ్లతో అనుకుంది కామాక్షి. "ఆ.. ఎంతలే.. నెలలోపే తన భర్త కూడా వచ్చేస్తాడ"న్న ధీమాతో గుండె దిటవు చేసుకుంది. పరాంకుశం కూడా అలాగే తలపోసి మనో నిబ్బరం తెచ్చుకున్నాడు.

............

అమెరికా చేరి కొడుకింట్లో కాలు పెట్టాకగానీ కామాక్షికి అసలు విషయం అర్థం కాలేదు. ఆదేశ్ అమెరికా వచ్చిన యేడాదికే అక్కడే సిటీలైన ఓ హిందీ అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడని, ఆ అమ్మాయి కూడా ఉద్యోగం చేస్తుందని, ఇప్పుడు ఆదేశ్‌కి పుట్టిన కొడుకుని చూసుకోడానికి ఎవరూ

కానీ "ఎం చేయాలమ్మా.. ఇక్కడ నువ్వు లేవు కదా నన్ను చూసుకోడానికి? నాకైతే మొదట్నుంచి ఇండియా వదిలి ఇక్కడికి రావటమే ఇష్టం లేదు. కానీ, నువ్వు, నాన్న, చుట్టాలు, ఫ్రెండ్స్ అంతా కలిసి ఇక్కడికి రావటమంటే స్వర్గానికి వచ్చినట్టని, అదే గొప్పని, లేకుంటే దేనికీ పనికిరాని చవటన్నట్టు మాట్లాడ్తుండటంతో నేనే అడిగి మరీ నా కొలీగ్ ఒకడు వెళ్ళనంటే, నేను వెళ్తానని వచ్చాను. ఈమె నాకు పరిచయమయ్యాక ఇంటి మీద, ఇండియా మీద బెంగ తగ్గింది. ఇంటిభోజనం దొరికింది. నాకు తీవ్రంగా జ్వరం వచ్చినపుడు తనే చూసుకుంది. అయితే, ఇవేమీ తెలియని మీతో మా పెళ్లి గురించీ చెబితే అస్సలు ఒప్పుకునేవాళ్ళు కాదు కదా? అందుకే చెప్పలేదు. క్షమించమ్మా" అనేసరికి మంచులా కరిగిపోయి చల్లబడిపోయింది కామాక్షి తల్లిమనసు.



కోడలికి, కొడుక్కి బాక్సులు కట్టివ్వడం, ఇల్లు సర్దుకోవటం, మనవడికి తినిపించటం, వాడ్ని తయారు చేసి వాడి ముద్దు ముచ్చట్లు చూసుకుంటూ అప్పుడప్పుడూ వాళ్ళు బయటకు తీసుకెళ్తే వెళ్ళిరావటం తప్ప మరో వ్యాపకం లేకుండా పోయింది ఆమెకు.

అప్పుడప్పుడూ కొడుకే ఫోన్ రింగ్ చేసి చేతికిస్తే భర్తతో మాట్లాడ్డం, జాగ్రత్తలు చెప్పడంతోనే మూడు నెలలు ఇట్టే గడిచిపోయాయి. "ఇంకొన్ని పనులున్నాయి. బెంగళూరులో నేను కొనబోతున్న విల్లాకి సంబంధించి కొన్ని పనులు నాన్న దగ్గరుండి చూసుకుని వస్తే బాగుంటుంది. కాస్త డబ్బులున్నపుడే ఇల్లో, స్థలమో కొనుక్కుంటే మంచిది కదా. మావి ప్రైవేట్ జాబ్స్ కాబట్టి తుమ్మితే ఊడిపోతాయి అప్పుడు కనీసం ఒకటో రెండో ఇళ్లైనా ఉంటే రెంటుకైనా ఇవ్వొచ్చు మరో జాబ్ వెతుక్కునేలోపు. మేం అక్కడికి వచ్చేసినా సొంత ఇంట్లో ఉండొచ్చు కదా మనమందరం" అని ఆదేశ్ చిలుకపలుకులు పలికితే, అవును కదా.. అని ఊరుకుంది కామాక్షి భర్తతో వీడియో కాల్స్ తోనే సరిపెట్టుకుని.

ఇప్పుడిక ఆరు నెలలు కూడా గడిచిపోయాయి. నెల నుంచీ భర్తతో ఫోన్లో కూడా మాట్లాడలేదు కామాక్షి, అదేమంటే, నాన్న హైదరాబాద్, బెంగళూర్ అంటూ తిరుగుతున్నారు బిజీగా" అంటూ దాటవేస్తున్నాడు.

ఆ రాత్రి కామాక్షికి నిద్రపట్టలేదు. "నువ్వు ధైర్యంగా వుండు కామాక్షీ. నెలలోపు నేను రాలేకపోతే నువ్వొచ్చేద్దువు గానీ, మరోసారి ఇద్దరం కలిసి వెళ్దాం" అంటూ తనకు ధైర్యం చెప్పినా గొంతులో నీరసం, వణుకు గుర్తొచ్చి వుండలేక వారానికల్లా బయలుదేరింది కామాక్షి మరో పది రోజుల సమయం ఉందన్నా వినకుండానే.

ఫ్లైటు ఎక్కించే ముందు "అమ్మా! నాన్న నెందుకు ఇబ్బంది పెట్టడమని మామయ్యకు ఫోన్ చేసాను. నిన్ను పికప్ చేసుకుని ఇంట్లో వదిలిపెడ్తాడు. నీ కోసం ఇద్దరు పనివాళ్లని కూడా మాట్లాడమని చెప్పా ధైర్యంగా వుండు. మరో ఆర్నెల్లకి మళ్ళీ వచ్చెయ్. నేనేం చేసినా మనందరి బాగు కోసం చేసా. అర్థం చేసుకో" అంటున్న ఆదేశ్ కళ్ళు చెమర్చడం చూసి తండ్రిని ఇక్కడికి తీసుకురాలేదన్న బెంగతో అనుకుంది కామాక్షి.

ఇండియా చేరి ఇంటికెళ్లాక, హాల్లో పెద్ద ప్రేము కట్టిన ఫోటోలో నుదుట బొట్టు, గంధపుమాలతో పలకరించిన పరాంకుశం రూపాన్ని చూసి అది కలో, నిజమో అర్థంకాక వణుకుతున్న కాళ్లతో చేష్టలుడిగి, ఎవరి మీద కోప్పడాలో.. మనసుకు, ఏడవాలన్న సంగతి కళ్లకు కూడా తోచనట్టు కూర్చుండిపోయింది కామాక్షి.

"బెంగళూరు నుంచీ వస్తుంటే కారుకు యాక్సిడెంటై స్పాట్‌లోనే పోతే నీ కొడుక్కి ఫోన్ చేసా. కాసేపు బాధపడి "ఇక్కడ భారీ వర్షాలు. ఫ్లైట్స్ రావటం లేదు. పైగా అమ్మసలే నాన్న మీద బెంగతో వుంది. ఇది విని తట్టుకోలేదు. నెమ్మదిగా చెప్తా. కానీ, ఏ కొరతా లేకుండా మీరే నాన్న అంతిమ సంస్కారాలు ముగించేయండి మామయ్యా. డబ్బులు మీ అకౌంట్లో వేస్తానన్నాడు ఆదేశ్" అని చెప్పాడు కామాక్షి తమ్ముడు.

నిజమే. విషయం తెలిసి వెంటనే తనొచ్చేస్తే అక్కడ వాడి భార్య పిల్లాడ్ని తను చూసుకోకపోతే ఆఫీసులో ప్రమోషన్లు, పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు ఆగిపోతాయి కదా? అంత పెద్ద విషయాల ముందు ఇంత చిన్న విషయాన్ని దాచాడన్నమాట, కామాక్షి పెదవులపై పేలవమైన నవ్వొకటి మెరిసి మాయమైంది.

తన దగ్గరికి రమ్మన్న తమ్ముడ్ని సున్నితంగా తిరస్కరించి, ఇల్లు అమ్మేసిన డబ్బులతో తననేదైనా వృద్ధాశ్రమంలో చేర్చమంది కామాక్షి. అన్ని వసతులతో ఈ మధ్యే పెట్టారంటూ తమ్ముడు చేర్చిన ఆశ్రమంలో తన కంటే ముందే అక్కడ చేరి వున్న బావగారు, తోటి కోడలే కాక తనకు తెలిసిన చాలామంది విదేశీ మోజుతో పిల్లల్ని పెంచిన తల్లిదండ్రులెందరో తనను ఆహ్వానిస్తూ అక్కడ కనిపించారు.

అప్పుడనుకుంది కామాక్షి స్వభావరీత్యా పిల్లలే తమ తోటివారి ప్రభావానికి గురై వెళ్లిపోతే గ్రహచారం. తామే మోజుకొద్దీ దూరం చేసుకుంటే స్వయంకృతం అవుతుందని.



## సరదా రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

*sunmagvaartha@gmail.com*

పుస్తక సమీక్ష

## చారిత్రక అవసరం




మార్క్సి ఎర్రజెండా, అంబేద్కర్ నీలి జెండా ఆశయ ప్రతీకలుగా వర్గ, కుల రహిత సమసమాజ స్వాప్నిక దార్శనికులు జి.రాములు, 'లాల్ నీల్ స్ఫూర్తి ప్రదాతలు వెలువరించడం ప్రశంసనీయం. సుమారు ఆరు దశాబ్దాల సుదీర్ఘ జీవితానుభవాలను, స్ఫూర్తిప్రదాతలైన ఆదర్శనీయ ఉద్యమ నిర్మాతలతో, కమ్యూనిస్టుగా వారి అనుభవాల నేపథ్యంలో మమేకమై, రచయిత ఆవిష్కరించారు. మహా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, మట్టిలో మాణిక్యంగా సమాజ శ్రేయస్సు లక్ష్యంగా అత్యున్నత స్థానానికి ఎదిగిన కాకి మాధవరావు, అదే కోవలో మానవతావాది యస్.ఆర్.శంకరన్, కమ్యూనిస్ట్ ఉద్యమనేత ఓంకార్, ప్రజా న్యాయమూర్తి చంద్రకుమార్, సమర్థ ప్రతిభా విద్యావేత్త ప్రొ.జి.రామ్‌రెడ్డి, బహుజన మేధావి, సమరశీలి ప్రొ॥ కంచ ఐలయ్య, పోరాట యోధుడు గద్దర్, పది మంది లాల్ నీల్ స్ఫూర్తిప్రదాతలతో రచయితకున్న ఆత్మీయ అనుబంధం, స్ఫూర్తివంతమైన జీవిత విశేషాలను వివరించారు. విభిన్న రంగాలకు చెందిన లబ్ధప్రతిష్ఠులు కావడం, మార్క్సిజం అంబేద్కరిజం రెండింటి ఐక్యతను ఆకాంక్షిస్తూ సుదీర్ఘ కాలం త్యాగపూరిత ఉద్యమ పోరాటాలను కొనసాగిస్తున్న రచయిత స్వకీయ సాన్నిహిత్యంతో వెలువరించిన ఈ పుస్తకం వర్తమాన రాజకీయ, సామాజిక తెరుతెన్నులలో ఒక చారిత్రక అవసరం.

**(లాల్‌నీల్ స్ఫూర్తి ప్రదాతలు; రచయిత: జి.రాములు; వెల: రూ.150/-, ప్రతులకు: తెలంగాణా పబ్లికేషన్స్, 1వ అంతస్తు, 1-1-80 15, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, హైదరాబాద్-20**

**– జయసూర్య**

## సందేశాన్నిచ్చే కథలు

1963 నుండి కథలు విరివిగా రాస్తున్న రచయిత్రి మీరాబాయి 7 కథా సంపుటాలు వెలువరించారు. కథల్లో క్లుప్తత, గాఢత, సామాజిక స్పృహ, ఆశావాహ దృక్పథం, మానవత వీరి కథల్లో ప్రత్యేకత. అంతర్జాల పత్రికలు సైతం వీరి కథలు ప్రచురించి పాఠకులకు విలువైన సందేశాత్మక కథనాలు అందించాయి. వేకువలో.. చీకటిలో, ఆమె, ఆపద్ధర్మం, సద్యోగం, అల, బందీలైన బాంధవ్యాలు, టాన్యా, అత్తమ్మ, రేపటికి మిగిలేది, ఆదిగురువు, అపరిచితులు లాంటి కథలు చాలా బాగున్నాయి. చాలా కథలు పత్రికల్లో ప్రచురితమై పాఠకుల ఆదరాభిమానాలు చూరగొన్నాయి. ప్రశాంతంగా జీవించే తరుణంలో వచ్చిన బి.బి., షుగర్, పనిమనిషి రంగమ్మ ఉన్నా ఇంట్లో పని; రిటైర్డ్ అయిన భర్త సత్యంలోని చిరాకు, 'శాంతి'ని బాగా బాధపెట్టే భర్త మాటలకు కుమిలిపోతుంది. కూతురు రమ్యకు చెప్పుకొంటుంది. బీరువాలో భర్త రాసిన ఎప్పటి లేఖలో కనబడటం, వాటిని చదివిన తరువాత భర్తపై జాలి, అభిమానం కలిగి శుశ్రూష చేసే శాంతి పాత్ర బాగా రాసారు. 'సద్యోగం' కథలో అత్త లీలావతి, వదినెల సూటిపోటి మాటలు, భర్త పవన్ చులకనగా మాట్లాడటం, పొరుగింటి పరిమళ స్నేహంతో సంధ్య మెస్ నడిపి డబ్బు సంపాదించి కొడుకు రవిని బాగా చదివించి భర్తకు ఆర్థిక తోడ్పాటు ఇస్తుంది. అన్ని కథలు ఏదో ఒక సందేశం ఇస్తాయి.

**(వేకువలో.. చీకటిలో; రచన: డా॥ కె.మీరాబాయి, పేజీలు: 274; వెల: రూ.200/-; ప్రతులకు: ఎమ్ఐజి 20, ఎపిహెచ్‌బి కాలనీ, బి.క్యాంపు, కర్నూలు-518 002. ఆంధ్రప్రదేశ్)**

**– తంగిరాల చక్రవర్తి**



## అందాయి

**తెలుగు పూల కోసం**
డా॥ ఎస్.వి.రమేష్ కుమార్(డా॥ సవేర)
అచ్చంగా తెలుగు ప్రచురణలు
ప్రతులకు: అచ్చంగా తెలుగు ప్రచురణలు
ఫోన్: 8558899478

**అన్నమయ్య సంకీర్తనామృతం**
(భావార్థ సహితము)
సేకరణ: టి.శాంతాభాస్కర్
ప్రతులకు: లోకేష్ ప్రచురణలు
2-711/2, షాహుకార్ బంగ్లా వీధి
కొంగారెడ్డిపల్లి, చిత్తూరు-517 001.

**బాలల కోసం.. భగవద్గీత**
(108 శ్లోకాలు)
టి.శాంతాభాస్కర్
ప్రతులకు: లోకేష్ ప్రచురణలు
2-711/2, షాహుకార్ బంగ్లా వీధి
కొంగారెడ్డిపల్లి,
చిత్తూరు-517 001.

**గర్భగుడి**
రచన: సలీం
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్.

**తెలుగులో నుడి-ముడి**
డాక్టర్ పి.నాగమల్లీశ్వర రావు
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్

**నా.. నానీలు**
నానా
ప్రతులకు: ఎన్.వి.సత్యనారాయణ(నానా)
63-5-596, ఎన్.ఎన్.నిలయం
బాలాజీ నగర్, 3/4 లేన్, పాత గుంటూరు
గుంటూరు-522 001

**తీర్థయాత్ర(నా ఆధ్యాత్మిక అన్వేషణ)**
డా॥ కాపెర్ల పవన్ కుమార్
ప్రచురణ: డా॥ పవన్ కుమార్ కాపెర్ల
4-9, సి.ఓ.కమ్మపల్లి, చిన్న ఓరంపాడు,
ఓబులవారిపల్లి, అన్నమయ్య జిల్లా
ఆంధ్రప్రదేశ్-516 108

**చంద్రునికో నూలుపోగు**
రచన: సలీం
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్.

**ద్రవిడ సూరీడు**
అన్నవరపు బ్రహ్మయ్య
తెలుగుతోరణం ప్రచురణ, విజయవాడ
ప్రతులకు: అన్నవరపు బ్రహ్మయ్య
15-103/3డి
గోపాలపూడి డైమండ్ అపార్ట్‌మెంట్
గొల్లపూడి, విజయవాడ-521 225

**తెలుగు కల్పవల్లి**
సవ్వప్పగారి ఈరన్న(మొలగవల్లి కొట్టాల)
ప్రతులకు: సప్పన్నగారి ఈరన్న
15-58-సి, యస్.ఆర్.పేట,
పత్తికొండ-518 380
కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్

**ఎ'లక్షణం'**
కోడం పవన్‌కుమార్
ప్రతులకు: లయ పబ్లికేషన్స్,
3-12-110/బి, గణేష్ నగర్
రామంతాపూర్, హైదరాబాద్-13.

# పోషకాల పండు.. స్ట్రాబెర్రీ

యామిజాల జగదీశ్

ఉత్తరప్రదేశ్‌లోని మోహనాల్గంజ్ పరిధిలోని గోపాలఖేడా గ్రామం. ఈ గ్రామానికి చెందిన సిద్ధార్థ్ సింగ్ ఎంబిఏ చేశాడు. యుకెలోని బహుళజాతి కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఇతను అది మానుకుని గ్రామానికి తిరిగి వచ్చి ఉపాధి కల్పనలో కొత్త అధ్యాయం సృష్టించాడు. అతను తన సమీప బంధువుతో కలిసి, గ్రామంలో స్ట్రాబెర్రీ సాగుతో లక్షలు ఆర్జించాడు. సొంతంగా సాగు చేసే ముందు అతను పూణే, హిమాచల్ ప్రదేశ్‌కు వెళ్లి స్ట్రాబెర్రీలను పండించడంలో సూక్ష్మ పద్ధతులను తెలుసుకున్నాడు! నమ్మకం వచ్చిన తర్వాత రాజేష్ సింగుతో సిద్ధార్థ్ సింగ్ కలిసి స్ట్రాబెర్రీ సాగుకు శ్రీకారం చుట్టాడు. స్ట్రాబెర్రీ సాగు చేసిన స్వల్ప కాలంలోనే లక్ష రూపాయల ఆదాయం వచ్చినట్లు వారు చెబుతున్నారు.

2019 సెప్టెంబర్లో పుణె నుంచి 25 వేల స్ట్రాబెర్రీ మొక్కలు తెప్పించి ఎకరం పొలంలో నాటారు. ఒకటిన్నర నెలలో ఆ మొక్కలు బాగా పెరిగాయి. మొదటి ఏడాదిలోనే మూడున్నర క్వింటాళ్ల మేరకు సాగు చేసి అధిక ఆదాయాన్ని ఆర్జించారు.

పాలీ హౌస్ టెక్నాలజీ కూల్ సీజన్ స్ట్రాబెర్రీ వ్యవసాయానికి అనువైనదని అంటున్నారు. కలుపు మొక్కల నుంచి పంటను రక్షించేందుకు పాలీ మల్చింగ్ టెక్నాలజీని ఉపయోగించారు. పంటలకు అవసరమైన నీటిని చుక్కల వారీగా అందించేందుకు డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని కూడా అనుసరించారు. వ్యవసాయ శాఖ కూడా రైతులకు అండగా నిలుస్తోంది.



కేరళలోని ఇడుక్కి జిల్లాలో కూరగాయల సాగు చేస్తున్న రైతులు సైతం స్ట్రాబెర్రీ సాగుపై దృష్టిమ సాధించారు. వారిని ప్రోత్సహించేందుకు కేరళలోని వ్యవసాయ శాఖ రైతులకు ఉచితంగా స్ట్రాబెర్రీ మొక్కలను అందించింది. దీంతో స్ట్రాబెర్రీ సాగులో నిమగ్నమైన వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. యాపిల్, ఆరెంజ్, ట్రీ టొమాటో, అవకాడో, ఐస్ క్యాబేజీ, బ్రోకలీ, రెడ్ క్యాబేజీ, బీట్రూట్ కూడా ఇక్కడ పండిస్తారు. హార్టికాస్ ఇడుక్కి జిల్లా మేనేజర్ సమీలా విసల్ రాజ్ నేతృత్వంలో స్ట్రాబెర్రీ సాగు కొనసాగుతోంది. ఆదివారం మినహా అన్ని రోజులలో ప్రవేశ రుసుముతో సందర్శకుల కోసం ఇక్కడి తోట తలుపులు తెరిచే ఉంటాయి.

ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన పండ్లలో స్ట్రాబెర్రీ ఒకటి. తీపిగా ఉంటాయి. ఇది విటమిన్లు, ఫైబర్, పాలీఫెనాల్స్ అని పిలువబడే యాంటీ ఆక్సిడెంట్లతో కూడినది. స్ట్రాబెర్రీల సాగు 1300లలో ఐరోపాలో ప్రారంభమైంది. ఫ్రాన్స్‌లోని ప్రజలు మొదట అడవి స్ట్రాబెర్రీని తోటల్లో సాగు చేయడం మొదలు పెట్టారు. 1600లలో, వలసవాదులు దానిని కనుగొన్నారు. ఇది రుచికరమైనది అయినప్పటికీ, ఇంగ్లాండ్‌లో 1700ల చివరి వరకు, 1800ల ప్రారంభం వరకు ప్రజాదరణ పొందలేదు. అదే సమయంలో, ఒక ఫ్రెంచ్ గూఢచారి చిలీ స్ట్రాబెర్రీని కనిపెట్టి, దానిని 1714లో ఫ్రాన్స్‌కు తీసుకువచ్చాడు. ఇది మునుపటి స్ట్రాబెర్రీల కంటే పెద్ద పరిమాణాన్ని కలిగి ఉంది. కానీ ఇది తీర ప్రాంత వాతావరణానికి దూరంగా పెరగడం కష్టంగా అనిపించింది. ఫ్రెంచ్ సాగుదారులు చిలియన్ స్ట్రాబెర్రీతో వర్జీనియా స్ట్రాబెరీని దాటినప్పుడు, మాయాజాలం జరిగింది. ఫలితంగా వచ్చిన స్ట్రాబెర్రీ గొప్ప రుచిని కలిగి ఉంది, గణనీయమైన పరిమాణాన్ని కలిగి ఉంది. మసాచుసెట్స్‌కు చెందిన ఇ.సి. హోవర్డ్ "హోవార్డ్ 17" అని పిలిచే రకాన్ని కనుగొన్నాడు.

## ప్రయోజనాలు

స్ట్రాబెర్రీలు అధిక ఆరోగ్య ప్రయోజనాలను అందించే రుచికరమైన పండు. బహుశా అందుకే ఇవి అత్యంత ప్రజాదరణ పొందిన పండ్లలో ఒకటైంది. వసంత కాలంలో పండే పండ్లలో స్ట్రాబెర్రీ ఒకటి. కేవలం మూడు వారాల వ్యవధిలో ఇది చేతికందుతుంది. ఎరుపు రంగుతో పాటు, స్ట్రాబెర్రీలు తెలుపు, గులాబీ, పసుపు, బంగారు రంగులో ఉంటాయి. ఈ రకాలు వివిధ రంగుల మొక్కల నుండి విత్తనాలను సేకరించడం ద్వారా సృష్టించబడతాయి.

నారింజ వంటి పాటెర్రీలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. అమెరికన్లు సంవత్సరానికి ఎనిమిది పౌండ్ల స్ట్రాబెర్రీలను తింటారని అంచనా. ఈ సంఖ్య 2020లో తలసరి 8.5 పౌండ్ల ఆల్ టైమ్ రికార్డుగా గరిష్ట స్థాయికి చేరుకుంది.

స్ట్రాబెర్రీల భయాన్ని ప్రాగారియా ఫోబియా అంటారు. ఈ పదం స్ట్రాబెర్రీ జాతికి చెందిన ప్రాగేరియా, ఫోబియాతో పాటు దయ అనే పదం నుండి పుట్టింది. నేషనల్ పి టెర్రీస్‌డేని యేటా మే 20న జరుపుకుంటారు. ఆ రోజు జాతీయ సెలవు దినంగా పాటిస్తారు. పురాతన రోమన్లు స్ట్రాబెర్రీలు అనేక రకాల జబ్బులను తగ్గించాయని నమ్మేవారు. స్ట్రాబెర్రీలు మానసిక ఆందోళన, మూర్ఛ, మంట, జ్వరాలతో సహా వివిధ వ్యాధులను తగ్గించడంలో సహాయపడేవని నమ్మారు. స్ట్రాబెర్రీలలో విటమిన్ సి అధికంగా ఉండటం దీనికి కారణం కావచ్చు. స్ట్రాబెర్రీల కోసం బెల్జియంలో ఒక మ్యూజియం ఉంది. బెల్జియంలో ముఖ్యంగా నెపియోన్ పట్టణంలో స్టాబెర్రీ సీజన్ చాలా ముఖ్యమైనది. అందుకే వారు ఈ ప్రాంతంలో పెరుగుతున్న స్ట్రాబెర్రీ చరిత్రను, ఆర్థిక వ్యవస్థకు దాని ప్రాముఖ్యతను వివరించడానికి మ్యూజియం అంకితం చేశారు. అమెరికాలో సాగయ్యే స్ట్రాబెర్రీలో 80 శాతం కాలిఫోర్నియాలోనే పండుతుంది. ఇక్కడి ప్రజలు స్ట్రాబెర్రీలను ఆరాధిస్తారు. కారణం.. అవి తీపిగా, జ్యూసీగా ఉండటమే. పైగా నమ్మశక్యం కాని పోషకాలు వీటిలో ఉండటం.

# వీధి పోటు వున్న ఇంట్లో ఉంటే?


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

సెల్: 9885446501/9885449458





(గత వారం తరువాయి...)

కొంతమందికి నమ్మకాలు ఉండవు. అటువంటి వాళ్ళు ఇలాంటి ఇళ్లల్లో కొంత కాలం ఉంటే ఈ బాధలు భరించలేక వాళ్లకు వాస్తు మీద నమ్మకం ఏర్పడే అవకాశాలు ఎక్కువ కనిపిస్తాయి. ఇటువంటి ఇళ్లల్లో ఉన్నప్పుడు, అంటే తూర్పు ఆగ్నేయ వీధిపోటు ఉన్న ఇళ్లల్లో ఉన్నా కూడా వాళ్లకి కలిగే ముఖ్యమైన నష్టాలు ఏమిటంటే...

చోర, అగ్ని భయాలు. చోర అంటే దొంగతనం. దొంగలింపబడటం లేదా తస్కరింపబడటం. అంటే వీళ్ళు ఇతరుల చేత మోసపోయి డబ్బు, దస్కం, సంపదలు మొదలైనవాటిని కోల్పోతారు. ఇదివరకు అంటే దొంగలు ఇళ్లలో పడి దోచుకునేవాళ్లు. ఇప్పుడు దొంగతనాలు అనేక రకాలుగా మారిపోయాయి. మీకు తెలియకుండానే బ్యాంకు ఖాతాలలో మీ డబ్బులు మీకు తెలియకుండానే మాయమైపోతున్నాయి. చోర కళ చాలా విధాలుగా పెరిగిపోయింది. ఏ విధంగా మన ఆస్తులు మాయమైపోతున్నాయో తెలియటం లేదు. నష్టాలు అనేక విధాలుగా తెలియకుండానే జరిగిపోతూ ఉన్నాయి. అగ్ని ప్రమాదాల వలన కూడా అనేక రకాల నష్టాలు జరిగిపోతుంటాయి. ఈ వీధి పోట్ల వలన చోరాగ్ని భయాలే కాకుండా, భార్యా భర్తల మధ్యన సత్సంబంధాలు కరువు అవటం గమనించవచ్చు. ఇద్దరు మంచివాళ్లే కావచ్చు. ఇద్దరి మనస్తత్వం కూడా మనిషిదే కావచ్చు. అయినా అపార్థాలు విపరీతంగా ఉంటాయి. ఒకరినొకరు అర్థం సరిగ్గా చేసుకోరు. దీనివల్ల ఇద్దరికీ విపరీతమైనటువంటి మనస్థాపం కలగటం, విషయం విడాకుల దాకా పోవటం జరుగుతుంది.

ఇంటి కుటుంబ సభ్యుల మధ్యన సరైన అవగాహన లేకపోవడం, ఒకరంటే ఒకరికి పడకపోవడం మనస్పర్థలు కంటిన్యూ అవుతూ ఉంటాయి. ద్వేష భావం పెరుగుతుంది కానీ దానికి కారణం తెలియదు. దీనినే 'అకారణ ద్వేషం' అంటారు. ఈ అకారణ ద్వేషం వలన కలిగే చెడు ఫలితాలు అనేక రకాలుగా ఉంటాయి. ఒకరినొకరు చూసుకోవటానికి కూడా ఇష్టపడరు. మాట్లాడుకోవటానికి ఇష్టపడరు. ఒకరు ముట్టుకున్నది మరొకరు ముట్టుకోరు. ఒకరి ఇచ్చింది మరొకరు తీసుకోరు. మంచి మాటలు కూడా విద్వేషపూరితంగా వినపడతాయి. ఒకరు ఎంతో మంచిగా మాట్లాడి దగ్గరవుదామనుకున్నా సరే, మరొకరు వారి ప్రయత్నాన్ని నెగెటివ్‌గా తీసుకొని దగ్గర అవటానికి ఇష్టపడరు. సమస్యలు అట్లాగే మిగిలిపోతూ ఉంటాయి. పోను పోను సమస్యలు జటిలం అయిపోతూ ఉంటాయి. క్రమంగా విపరీత దుష్పరిణామాలకు దారి తీస్తాయి. అటువంటప్పుడు శ్రద్ధ పెట్టవలసిన మొట్టమొదటి విషయం ఏమిటంటే–

వీధి పోటు ఉన్నా సరే, ఆ ఇంట్లో ఆగ్నేయంలో వంట చేయటం ముఖ్యం. అలా చేయటం వలన ఈ చెడు పరిణామాల సాంద్రత కొంచెం తగ్గుతుంది. ఆగ్నేయంలోనే వంటగది చాలా మందికి ఉంటుంది. అలా ఆగ్నేయంలో కూడా వంటగది లేకుండా తూర్పు ఆగ్నేయం వీధి పోటు దోషం ఉన్నట్లయితే అందులో నివసించేవాళ్ల పరిస్థితి చాలా దారుణంగా తయారవుతుంది. అలా ఉన్నప్పుడు కూడా ఇంటికి ఆగ్నేయం మూలన.. అది బెడ్ రూమ్ కావచ్చు... డ్రాయింగ్ రూమ్ కావచ్చు, అక్కడ ఆగ్నేయం కార్నర్‌కి ఒక చిన్న స్టూలు మీద ఒక చిన్న స్టవ్ ఒకటి పెట్టేసుకొని అక్కడ రోడ్డు పొద్దున కాఫీ, టీ, పాలు వేడి చేయటం లాంటి ఏదో ఒకటి వంట చేస్తూ ఉంటే తప్పకుండా కొంతలో కొంత స్వాంతన లభిస్తుంది. ఈ వీధి పోటు దుష్పరిణామాల సాంద్రత తగ్గుతూ, లభించే స్వాంతన పెరుగుతూ ఉంటుంది. ఇది క్రమంగా గుర్తించవచ్చు. ఇలాంటి వీధి పోటుగల ఇళ్లల్లో తప్పనిసరిగా ఉండవలసి వచ్చినప్పుడు, సాధారణంగా చిన్న చిన్న




రెమెడీస్ ఉంటాయి... వాటిని ఉపయోగించుకోవచ్చు. రెమెడీస్ పాటించటం వలన ఈ చెడు ఫలితాల సాంద్రత తగ్గుతుంది. ఆ వీధిపోటు ఎదురుగా గోడలో ప్రతిష్ఠించుకునే ఒక 'యంత్ర స్థాపన' ఉంటుంది. ఆ యంత్ర స్థాపన చేసుకోవడం వల్ల వీధి పోటు చెడు పరిణామాల సాంద్రత క్రమంగా తగ్గుతుంది.

అలా కాలం గడుస్తున్నకొద్దీ ఆ చెడు ఫలితాల సాంద్రత చాలా వరకు తగ్గిపోతూ ఉంటుంది. యంత్ర స్థాపన గోడలోపల ఉండిపోతుంది బయట ఎవరికి కనపడదు. రెమెడీస్ ఎప్పుడు సెకండరీనే. ఒరిజినల్‌గా ఉండేది మనకి ముఖ్యం. తప్పనిసరి అయిన పరిస్థితుల్లో రెమెడీస్ వాడి మంచి ఫలితాలు పొందవచ్చు. కానీ వీలైనంత వరకు ఇటువంటి వీధి పోట్లు ఉన్న ఇళ్లల్లో చేరకుండా, కొనకుండా జాగ్రత్త పడటం మంచిది. ●

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ..........................................

పుట్టిన తేది : ..........................................

జన్మ నక్షత్రం: .................తల్లి పేరు: .............

చిరునామా:.............................................

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

# మహా కుండలినీ క్షేత్రం

పాశుపత బంధ ఆలయాల్లో నాలుగవది చివరిది శ్రీ నాగేశ్వర స్వామి కొలువు తీరిన దుగ్గిరాల. మిగిలిన మూడు క్షేత్రాలైన కొలకలూరు, నందివెలుగు, ఈమని ఆలయాల గురించి తెలుసుకున్నాం. ఈ నాలుగు ఆలయాలను ఇదే వరుస క్రమంలో ఏదైనా దర్శించుకొని, విజయవాడ ఇంద్రకీలాద్రి పర్వత పాదాల వద్ద ఉన్న శ్రీ విజయేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించుకోవడం వలన సకల మనోభీష్టాలు నెరవేరతాయన్నది భక్తుల విశ్వాసం.

మొదటి మూడు చంద్రకళ, అగ్నికళ, సూర్య కళలకు ప్రతీకలు కాగా శ్రీ నాగేశ్వర స్వామి ఆలయం మహా కుండలిని క్షేత్రంగా పేర్కొనపడింది.

ఈ నాలుగు క్షేత్రాలు ఎక్కుపెట్టిన ధనుస్సు వింటితాడు లాగా ఉంటాయి. వింటి నారిని సంధించే స్థలం అంటే పూర్తి ఏకాగ్రతతో శరాన్ని సంధిస్తారు కనుక ఈ క్షేత్రం కుండలినీ క్షేత్రంగా అభివర్ణిస్తారు.

ఈ నాలుగు క్షేత్రాలలో లింగరాజును శ్రీ అగస్త్యమహర్షి ప్రతిష్ఠించారని తెలుస్తోంది. అనంతర కాలంలో చాళుక్య రాజులు ఈ ఆలయాన్ని నిర్మించారని శాసనాలు తెలుపుతున్నాయి. తరువాత ఈ ప్రాంతాన్ని అమరావతిని రాజధానిగా చేసుకొని పాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గారు ఆలయాన్ని పునః నిర్మించి, ఆలయ నిర్వహణకు భూమి, ధనం సమర్పించుకొన్నారని తెలియవస్తోంది.

### ఆలయ విశేషాలు

నాగేశ్వర స్వామి లింగం కూడా శ్రీ అగస్త్య మహర్షి ప్రతిష్ఠ అని చెబుతారు. కానీ కుండలినీ శక్తికి పర్యాయ క్షేత్రంగా, నాగ పూజలకు ప్రసిద్ధి చెందడంతో స్వామి వారిని శ్రీ నాగేశ్వర స్వామి అని పిలుస్తున్నారు.

సువిశాల ప్రాంగణంలో ప్రధాన రహదారి మీద నెలకొని ఉన్న ఈ ఆలయం తూర్పు ముఖంగా ఉంటుంది. రాజగోపురం ఉండదు కానీ ఎత్తైన ధ్వజస్థంభం బలి పీఠాలు కనపడతాయి.

ప్రాంగణం ఈశాన్యంలో కల్యాణ మండపం, ఆగ్నేయంలో నాగప్రతిష్ఠ, నాగ శాసనం ఉంటాయి. ముఖ మండపం పైన శ్రీ గణపతి, ఆది దంపతులు, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, ఇతర దేవీ దేవతల వర్ణమయ రూపాలు సుందరంగా దర్శనమిస్తాయి.

ప్రదక్షిణా పథంలో చిన్న మండపం, శ్రీ నాగ సన్నిధి, ద్వాదశ, అష్టాదశ పీఠాల వివరాలు తెలిపే శిలా ఫలకం ఏర్పాటు చేశారు. గోముఖి వద్ద శ్రీ చండికేశ్వర సన్నిధి ఈ ఆలయంలో కూడా కనపడుతుంది.

### శ్రీ చండికేశ్వర స్వామి

పశువుల కాపరి కుమారుడైన చండికేశ్వరుడు చిన్నవయస్సు నుండి కూడా విశేషమైన శివ భక్తి కలిగి ఉండేవాడు. ఇసుకతో శివలింగాలను సుందరంగా తీర్చిదిద్ది ఆవుపాలను నివేదన చేస్తుండేవాడు. నిరంతరం శివ నామస్మరణలో మునిగి తేలుతుండేవాడు.



అతని భక్తి తల్లిదండ్రులకు ఆనందం కలిగించినా అతనికి మరో ధ్యాస లేకపోవడం వాళ్లను విచారపరచేది. కుమారుణ్ణి దండిస్తే మారుతాడన్న ఆలోచనతో ఒకనాడు తండ్రి అతన్ని మందలిస్తూ పొరబాటున సైకత లింగాన్ని తొక్కాడు. తనని ఎన్ని మాటలన్నా పట్టించుకోని చండికేశ్వరుడు శివలింగాన్ని తండ్రి అపవిత్రం చేయడంతో ఆగ్రహం చెంది ఖడ్గంతో కన్నతండ్రి కళ్లను నరికేశాడు. అతని భక్తికి మెచ్చిన భక్తసులభుడు సాక్షాత్కరించి ఎల్లప్పుడూ తనతో ఉండేలాగా వరం ప్రసాదించారు. మన దగ్గర తక్కువ. కానీ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోని ప్రతి శివాలయంలో గోముఖి వద్ద శ్రీ చండికేశ్వరుని సన్నిధి కనపడుతుంది.

నిరంతరం ధ్యాన ముద్రలో ఉండే శ్రీ చండికేశ్వరుని అనుగ్రహం తద్వారా మహేశ్వరుని ఆశీర్వాదం పొందాలన్న తపనతో భక్తులు శ్రీ చండికేశ్వరుని సన్నిధి వద్ద చిటికెలు వేయడం లేదా చిన్నగా చప్పట్లు కొట్టి తమ గోత్ర నామాలు చెప్పుకోవడం కనపడుతుంది.

మరో విశ్వాసం ప్రకారం ధ్యానంలో ఉన్నా తన స్వామి వారి సన్నిధికి వచ్చిన భక్తుల వివరాలను శ్రీ చండికేశ్వరుడు నమోదు చేస్తాడని. ఆలయ ఉత్సవాలలో, ఊరేగింపులలో మూలవిరాట్టుతో సమానమైన ప్రాధాన్యత శ్రీ చండికేశ్వరునికి ఇవ్వడం జరుగుతుంది. ఈ మధ్య మన రాష్ట్రంలోని పురాతన, నూతన ఆలయాలలో ప్రత్యేకంగా శ్రీ దక్షిణామూర్తి సన్నిధితో పాటు శ్రీ చండికేశ్వర సన్నిధి కూడా ఏర్పాటు చేయడం కనపడుతోంది. ఈ నాలుగు మహా పాశుపత బంధ ఆలయాలలో శ్రీ చండికేశ్వర సన్నిధి ఏర్పాటు చేశారు.

ఆలయ వెలుపలి గోడలపైన శ్రీ దక్షిణామూర్తి, శ్రీ నటరాజ స్వామి, శ్రీ గణపతి, శ్రీ దుర్గ, శ్రీ సరస్వతి, శ్రీ గాయత్రి, శ్రీ మహిషాసురమర్దిని ఆదిగా గల దేవీ మొదలైన దేవతల రూపాలను సుందరంగా అమర్చారు.

శ్రీ నాగేశ్వర స్వామి ఆలయంలోని నవగ్రహ మండపాన్ని నిర్మించారు. ప్రదక్షిణ నూతనంగా నిర్మించిన విశాలమైన ఆస్థాన మండపానికి చక్కని లతలు, పూలతో సుందరంగా తీర్చిదిద్దిన ద్వారం దాటి అర్ధ మండపంలోని ప్రవేశిస్తే అక్కడ దక్షిణ ముఖంగా శ్రీ పార్వతీ అమ్మవారు రమణీయ అలంకరణలో ద్విభుజిగా ఉపస్థిత భంగిమలో కొలువై ఉంటారు.

సన్నిధిలో శ్రీ వినాయక స్వామి కుడి వైపు తొండం ఉన్న భంగిమలో దర్శనమిస్తారు. ఇలా కుడి వైపుకు తొండం తిరిగి ఉన్న విఘ్న నాధుని "శ్రీ వలంపురి వినాయకుడు" అని పిలుస్తారు. ఈ రూపం లో కొలువైన గణపతి అత్యంత భక్త సులభుడు, వరదాత అని చెబుతారు. ఇక్కడే శిలాద తనయుడు శ్రీ నందీశ్వరుడు ఉపస్థితులై సదా స్వామి సేవ కోసం సిద్ధం అన్నట్లు కనపడతారు,

గర్భాలయంలో పానవట్టం మీద చందన విభూతి లేపనాలతో చక్కని పుష్ప అలంకరణలో లింగ రూపంలో శ్రీ నాగేశ్వరస్వామి నేత్రానందంగా దర్శనం ప్రసాదిస్తారు.

నిత్యం ఉదయం ఆరు గంటల నుండి మధ్యాహ్నం పన్నెండు వరకు తిరిగి సాయంత్రం నాలుగు నుండి రాత్రి ఎనిమిది వరకు భక్తుల కొరకు తెరిచి ఉంటుంది. అన్నీ హిందూ పర్వదినాలలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, సేవలు జరుగుతాయి. శ్రీ గణపతి నవరాత్రులు, శ్రీ దుర్గా నవరాత్రులు, కార్తీక మాస పూజలు, శ్రీ సుబ్రహ్మణ్య షష్టి, శ్రీ మహా శివరాత్రి, ఆరుద్రోత్సవం, ఆలయ వార్షిక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

## శ్రీ చెన్న కేశవ స్వామి ఆలయం

పూర్వ పాలకులు వారికి సలహాదారులుగా ఉన్న మంత్రి దండనాథులు బాగా ముందుచూపు గలవారు. ఎందుకంటే ఇతర మతాలు మన దేశంలోకి ప్రవేశించడానికి ముందు శైవం, శ్రీ వైష్ణవం ఉండేవి. ప్రజలు వీటిలో ఏదో ఒక దానిని అనుసరించేవారు. వారి మధ్య సమభావన నెలకొల్పేందుకు ప్రతి గ్రామంలోనూ నాటి పాలకులు హరిహరుల ఆలయాలను నిర్మించారు.

దుగ్గిరాలలో కూడా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారి ఆలయం ఉన్నది. విశాల ప్రాంగణంలో తూర్పు ముఖంగా ఉన్న ప్రస్తుత ఆలయాన్ని పదకొండవ శతాబ్దంలో చాళుక్య రాజులు నిర్మించినట్లు తెలుస్తోంది. అనంతర కాలంలో ఈ ప్రాంతాన్ని పాలించిన పాలకులందరూ స్వామివారిని సేవించారని ఆధారాలు తెలుపుతున్నాయి.

కానీ ముఖ మండప స్తంభాల పైన కనపడుతున్న పదవ శతాబ్దపు శాసనాలు ఈ ఆలయం అంతకు ముందు నుండే ఉన్నది అని రుజువులు చూపుతున్నాయి. ప్రధాన ఆలయంలో శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ దేవి, శ్రీ గోదాదేవి మూడు సన్నిధులలో దర్శనమిస్తారు. ధ్వజస్థంభం వద్ద దక్షిణాముఖునిగా శ్రీ అంజనేయ స్వామి కొలువై ఉంటారు.

శ్రీ చెన్నకేశవ అంటే సుందరమైన తలకట్టు (కేశాలు) ఉన్నవాడు, కేశి అనే రాక్షసిని సంహరించిన శ్రీ కృష్ణుడు అని అర్థం.

"చెన్న" అంటే అందమైన అని అర్థం చెబుతారు. అందమైన కేశవుడు అనేక రాజ వంశాలకు కులదైవం. కర్ణాటక రాష్ట్రం బేలూరులోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం ప్రపంచ ప్రసిద్ధికెక్కిన నిర్మాణం..

శ్రీ చెన్నకేశవస్వామి ఆలయాలు ఎక్కువగా కర్ణాటక, కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమలలో కనపడతాయి. తమిళనాడు, కేరళలలో శ్రీ చెన్నకేశవ ఆలయాలు కనపడవు. అలంకార ప్రియ విష్ణు అన్నదానికి నిదర్శనంగా ఈ ఆలయంలో స్వామి దేదీప్యమానమైన అలంకరణలో నయనానందకరంగా దర్శనం ప్రసాదిస్తారు. ప్రధాన సన్నిధికి ఇరుపక్కలా దేవేరులు కొలువు తీరి ఉంటారు.

ఈ ఆలయంలో కూడా ఈశాన్యంలో కల్యాణ మండపం కనిపిస్తుంది. గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలో అధిక శాతం పురాతన ఆలయాలలో ఇలా కల్యాణ మండపం కనిపించడం ఒక ఆనవాయితీ అనుకోవాలి.

ప్రధాన ఆలయానికి పక్కన శ్రీ పట్టాభిరాముడు కొలువైన మరో ఆలయం కూడా ఈ ప్రాంగణంలో కనపడుతుంది. మిగిలిన ఆలయాలకు భిన్నంగా ఇక్కడ శ్రీ సీతారాములు భద్రాచలంలో మాదిరి దర్శనమిస్తారు. పక్కనే సోదరుడు శ్రీ లక్ష్మణస్వామి ఎదురుగా ధ్వజస్థంభం వద్ద ముకుళిత



హస్తాలతో శ్రీ దాసాంజనేయ స్వామి కూడా కొలువై ఉంటూ గత మూడు వందల సంవత్సరాలుగా అంటే 1730 నుండి శ్రీ జంపాల వంశంవారి ఆధ్వర్యంలో ఉన్న ఆలయంలో అర్చక స్వాములు కూడా నాలుగు తరాలుగా స్వామి సేవలో తరిస్తున్నారు.

ప్రతిరోజు ఉదయం ఆరు నుండి పద్దకొండు వరకు తిరిగి సాయంత్రం అయిదు నుండి రాత్రి ఎనిమిది వరకు తెరిచి ఉండే శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో వైఖానస విధానంలో పూజలు జరుగుతాయి.

శ్రీ కృష్ణ జన్మాష్టమి, శ్రీరామ నవమి. శ్రీ నరసింహ జయంతి. శ్రీ హనుమజ్జయంతి, వైకుంఠ ఏకాదశి, ధనుర్మాస పూజలు, శ్రీ గోదా కల్యాణం, ఇతర హిందూ పర్వదినాలలో విశేషంగా నిర్వహిస్తారు చైత్ర మాసంలో ఆలయ బ్రహ్మోత్సవాలు రంగరంగ వైభవంగా జరుపుతారు.

దుగ్గిరాల గ్రామంలో మరికొన్ని ఆలయాలు కనిపిస్తాయి. వాటిల్లో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం ముఖ్యమైనది. ప్రధాన రహదారి మీద విశాల ప్రాంగణంలో శబరిమల ఆలయ శైలిలో నిర్మించిన ఆలయంలో కేరళ విధానంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ముఖ్యంగా కార్తిక మాసంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఇన్ని విశేషాల నిలయమైన దుగ్గిరాలకు తెనాలి, గుంటూరు, మంగళగిరి, విజయవాడ నుండి సులభంగా రహదారి మార్గంలో చేరుకోవచ్చు. వసతి భోజన సౌకర్యాలు అందుబాటులో లేవు.

# అద్భుతమైన జలపాతాలు

షేక్ అబ్దుల్ హకీం జాని

ఆంధ్రప్రదేశ్‌లో అద్భుతమైన జలపాతాలు అనేకం ఉన్నాయి. ఇవి పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వారాంతపు సెలవుల్లో పర్యాటకులు ఈ జలపాతాలను చూడటానికి వచ్చి సందడి చేస్తుంటారు.

## ఎత్తిపోతల జలపాతం

సుందరమైన ఎత్తిపోతల జలపాతం ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో మాచర్ల నుండి నాగార్జున సాగర్‌కు వెళ్ళే దారిలో ఏడవ మైలు వద్ద చీలిన అడ్డదారిలో మూడు కిలోమీటర్ల దూరాన ఉంది. దాదాపు డెబ్బై అడుగుల ఎత్తుపై నుండి నీరు కిందకు పడే రమణీయ దృశ్యం ఇక్కడ కనిపిస్తుంది. దేశంలోని సుదూర ప్రాంతాల్లో వున్న జలపాతాల్ని వీక్షించలేని పర్యాటకులు ఎత్తిపోతలను చూసి ఆనందంతో పరవశిస్తారు. ఒకప్పుడు ఇక్కడ యతులు తపస్సు చేసేవారట. ఆ కారణంగా తొలుత దీనికి యతిపోతల అనే పేరు వచ్చింది. కాలక్రమంలో ఎత్తిపోతలగా మారింది. కొందరి అభిప్రాయం ప్రకారం మాచర్ల నుండి వచ్చే చంద్రవంక వాగు, తూర్పు దక్షిణం వైపు ప్రవహిస్తూ వచ్చే తుమ్మల వాగు, నక్కలవాగు ప్రవాహాలు ఇక్కడ ఏకమై దాదాపు నలభై అడుగుల ఎత్తు నుండి కిందకు దుముకుతున్నట్లు తెలుస్తోంది. మరికొందరి అభిప్రాయం ప్రకారం కొండల్లో పడిన వర్షపు నీటితో పాటు భూగర్భంలో ప్రవహించే కొన్ని వాగులు ఎత్తిపోతల వద్ద పెల్లుబికి చంద్రవంక వంటి మరికొన్ని వాగులతో కలిసి జలపాతంగా ఏర్పడినట్లు తెలుస్తోంది. వర్షాకాలంలో ఎత్తిపోతల సోయగం చూడముచ్చటగా ఉంటుంది.

సమీపంలో ప్రభుత్వంవారి మొసళ్ళ పెంపక కేంద్రమున్నది. ఎత్తిపోతల జలపాతం నీరు పై నుండి కిందకు పడి వాగులో చేరుతుంది. ఈ వాగులో మొసళ్ళను పెంచడం వలన ఇక్కడ పర్యాటకులు స్నానాలు చేయడం నిషిద్ధం.

## తలకోన జలపాతం


తలకోన జలపాతం


తిరుపతి సమీపాన ఎర్రావారిపాళెం మండలంలో నెరబైలుకు 9 కి. మీ. దూరంలో అటవీ ప్రాంతంలో ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రం తలకోన. శేషాచల కొండల వరుసలో తల భాగంలో వున్నందున దీన్ని తలకోన అంటారు. తిరుపతికి సుమారు అరవై కి.మీ. దూరంలో నెలకొని ఉంది. తిరుపతి, పీలేరు నుంచి ఆర్టీసీ బస్సులు నడుస్తుంటాయి. తలకోన జలపాతం ప్రకృతి ప్రేమికులను మైమరచిపోయేలా చేసే పర్యటక కేంద్రం. సూర్య కిరణాలు నేలకు పడనంత దట్టంగా ఉండే తలకోన అటవీ ప్రాంతంలో ఉన్న ప్రకృతి అందాలు సందర్శకులను కట్టిపడేస్తాయి. దట్టమైన కీకారణ్యం మధ్య ఈ జలపాతం 300 అడుగుల ఎత్తు నుండి కిందకు జాలువారుతూ నయనానందకరంగా కనిపిస్తుంది. ఈ అటవీ ప్రాంతంలో మద్ది, చందనం ఎర్ర చందనం వంటి వృక్షాలు అధికంగా ఉన్నాయి. అడవి కోళ్ళు, నెమళ్లు, దేవాంగ పిల్లి, ఎలుగులు, మొ॥ జంతుజాలం ఉంది. ఇక్కడ అనేక తెలుగు చిత్రాలను చిత్రీకరించారు.

## కొత్తపల్లి జలపాతం

విశాఖ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గంగరాజు మాడుగుల మండలంలోని ఒక గ్రామం కొత్తపల్లి. విశాఖపట్నానికి, పశ్చిమంగా 96 కిలోమీటర్ల దూరంలో కొత్తపల్లి ఉంది. చింతపల్లి నుంచి పాడేరు వెళ్లే మార్గంలో కొక్కిరపల్లి ఘాట్ దిగువన కొత్తపల్లి గ్రామం ఉంది. ఇక్కడ 20 నుంచి 50 మీటర్ల ఎత్తుతో పది జలపాతాలు ఉన్నాయి. పాడేరు నుండి 35 కిలోమీటర్ల దూరంలో, జి.మాడుగుల నుండి చింతపల్లి మార్గంలో ఈ జలపాతం ఉంది. కొత్తపల్లి గ్రామస్థులు, కొంతమంది విద్యార్థులు ఈ జలపాతాన్ని వెలుగులోకి తెచ్చారు. ఈ జలపాతం ముందు భాగం నుంచి కర్రలు, రోడ్డు మార్గం ద్వారా పర్యాటకులు లోపలికి వెళ్తుంటారు. వివిధ మండలాలు, జిల్లాల నుండి సందర్శకులు జలపాత ప్రదేశానికి వస్తుంటారు.

## కటిక జలపాతం

విశాఖపట్నం సమీపంలోని ఒక పర్యాటక ప్రదేశం కటిక జలపాతం. ఇక్కడ రమారమి యాభై అడుగుల ఎత్తు నుండి నీరు జాలువారుతుంది. బొర్రా గుహలు రైల్వేస్టేషన్‌లో దిగితే అక్కడ నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కటిక జలపాతం చేరుకోవడానికి జీపులు ఉంటాయి. ఇది పర్వతారోహణకు కూడా అనువైన ప్రదేశమే. అక్కడే పలు ప్రాంతాల నుండి వచ్చినవారు గుడారాలు వేసుకుని, వంట చేసుకుని, తిని ఉల్లాసంగా గడుపుతుంటారు. ఆగస్టు నుండి డిసెంబరు మధ్య కాలం దీన్ని సందర్శించడానికి అనువైన సమయం.


కటిక జలపాతం




## తాడిగుడ జలపాతం

విశాఖపట్నం జిల్లా, అనంతగిరి వద్ద వున్న ఒక అద్భుత జలపాతం తాడిగుడ జలపాతం. దీన్ని అనంతగిరి జలపాతం అని కూడా పిలుస్తారు. దాదాపు రెండు వందల అడుగుల ఎత్తు నుండి దుమికే జలపాతం సందర్శకులకు కనువిందు చేస్తుంది. అనంతగిరి నుండి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. అనంతగిరి నుండి కాలినడకన ఈ జలపాతానికి చేరుకోవచ్చు. ఈ జలపాతం వద్ద పాచిపట్టిన రాళ్ళు అధికంగా ఉంటాయి. స్నానం చేసేవారు జాగ్రత్తగా ఉండాలి.





## కైగల్ జలపాతం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో కైగల్ జలపాతం ఉంది. ఇది వెంకటగిరి కోటకు పదహారు కి.మీ. దూరంలోను, కైగల్ గ్రామానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది సముద్ర మట్టానికి 633 మీటర్లు ఎత్తులో వున్నది. స్థానికంగా దీన్ని దుముకు జలపాతాలు అంటారు. ఇక్కడి నీరు 40 అడుగుల ఎత్తు ఉన్న రాళ్లపై నుండి దుముకుతూ కింద పడుతూ ఉండటం వల్ల దీనికి ఆ పేరు వచ్చింది. ఇది సహజ జలపాతం. ఇది ఎల్లవేళలా ప్రవహిస్తుంటుంది. కాని వర్షాకాల సమయంలో ఇందులో ప్రవాహం ఎక్కువగా వుంటుంది. జలపాతం కింద అనేక సహజ కొలనులు ఉన్నాయి. ఇది అరణ్య ప్రాంతం కావడం చేత వృక్షాలు, కొండలు, పక్షులు మొదలైన ప్రకృతి అందాలు పర్యాటకులకు నయనానందం చేస్తాయి.

ఈ జలపాతం కైగల్ ప్రవాహం ద్వారా ఏర్పడుతున్నది. కౌండిన్య వన్యప్రాణుల అభయారణ్యంలో ప్రవహించే రెండు ప్రవాహాలలో ఇది ఒకటి. రెండోది.. కౌండిన్య. దీన్ని ఒక తీర్థంగా భావిస్తారు. ఇవి బైరెడ్డిపల్లి మండలం కిందకు వస్తాయి. ఈ జలపాతాన్ని వర్షాకాలం జూన్ నుండి అక్టోబరు మధ్యన సందర్శించడానికి చాల బాగుంటుంది. ఈ పరిసర ప్రాంతాలు మంచి పిక్నిక్ ప్రదేశాలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ జలపాతం దేవదొడ్డి, కైగల్ గ్రామం మధ్యలో ఉంది. కైగల్ వరకు బస్సులో వెళ్ళవచ్చు. అక్కడ నుండి దాదాపు రెండు కిలోమీటర్ల దట్టమైన అరణ్యంలో కాలినడక దారిలో నడవాలి. అక్కడే ఈ జలపాతం వున్నది.

## ఉబ్బల మడుగు జలపాతం

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో బుచ్చినాయుడు ఖండ్రిగ మండలంలో సిద్ధుల కోన అనే అడవిలో ఉంది. వరదయ్య పాలెం గ్రామం నుండి సుమారు 7 కి.మీ. దూరంలోను, శ్రీకాళహస్తి నుండి 35 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ పెద్ద ఉత్సవం జరుగుతుంది. అక్టోబరు నుండి ఫిబ్రవరి వరకు, వర్షాకాల సమయంలో ఈ జలపాతంలో నీరు అధికంగా ఉంటుంది. ఆ కారణంగా ఈ ప్రాంతం పచ్చదనంతో కళకళలాడుతూ ఉంటుంది. పర్వతారోహణకు, విహార యాత్రలకు ఇది చాల అందమైన ప్రదేశం. రాత్రి సమయంలో ఇక్కడ ఉండటం క్షేమం కాదు.




## భైరవకోన జలపాతం

ప్రకాశం జిల్లాలోని చంద్రశేఖరపురం మండలంలో కొత్తపల్లి గ్రామానికి 6 కి.మీ. దూరంలో భైరవ కోన జలపాతం ఉంది. ప్రకాశం జిల్లా ముఖ్య పట్టణమైన ఒంగోలుకు 120 కి.మీ. దూరంలో ఈ జలపాతం ఉంది. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల సరిహద్దుల్లో ఈ ప్రదేశం ఉంది. దాదాపు రెండు వందల మీటర్ల ఎత్తు నుండి కిందకు జాలువారే ఈ జలపాతం పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. మూలికా జలపాతంగా ప్రసిద్ధి చెందిన చారిత్రాత్మక ప్రాముఖ్యత కల ఈ జలపాతాన్ని సందర్శించడానికి అనునిత్యం పర్యాటకులు వస్తూనే ఉంటారు. ఇక్కడ ఎప్పుడూ నీరుండటం వల్ల ఈ ప్రాంతమంతా పచ్చదనంతో నిండి ఉంటుంది. జలపాతం పైనుండి కిందకు పడిన నీరు లోతు తక్కువగా ఉన్న అతి పెద్ద కొలను పడుతుంది.

ఈ జలపాతంలో వేసవి కాలంలో నీరు తక్కువగా ఉన్నప్పటికీ, వర్షాకాలంలో, విపరీతంగా నీరు జలజలా జారువారుతూ జలకళతో కనువిందు చేస్తుంది. ఈ ప్రాంతంలో ప్రాచీన శివాలయం ఉంది. పల్లవుల శిల్పకారుడైన చేరుకుంతి ఇక్కడి ఆలయాలను శిల్పీకరించినట్లు చరిత్ర చెబుతోంది.

ఉపకారాన్ని గురించిన భావనలన్నింటి సమ్మేళనమే భగవంతుడు.

– వివేకానంద

## ఫిబ్రవరి 16, 2025 నుండి ఫిబ్రవరి 22, 2025 వరకు



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం ఎంతో పని ఉన్నప్పటికీ ఉత్సాహం మాత్రం ఉండదు. పాత బంగారాన్ని మార్చాలని ఆలోచనలు జరుపుతారు. విందు వినోదాలలో చురుగ్గా పాల్గొంటారు. స్త్రీ సంతానం పట్ల మక్కువ కలిగి ఉంటారు. వాళ్లకు విలువైన వస్తువులు, వస్త్రాలు బహుమతులుగా ఇస్తారు. కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రయోజనాలని అందుకుంటారు. యజ్ఞ భస్మంతో శివ అర్చన చేసి ఆ భస్మంని బొట్టుగా ధరించండి. . పోరాటంలో పాల్గొన్న ఆలోచనలు కలుగుతాయి.

ఈ వారం సహోదర సహోదరీ వర్గంతో సఖ్యతగా మెలగాలి ఆలోచనలు కలుగుతాయి. వారి ప్రవర్తన మాత్రం కాస్త దురుసుగా ఉంటుంది. కుటుంబ పరువు మర్యాదలను చెడగొట్టడం ఇష్టం లేక ఎంతో ఓర్పుతో సహనంతో మీరు వారిని భరిస్తుంటారు. యజ్ఞ భస్మంతో శివ అర్చన చేసి ఆ భస్మంని బొట్టుగా ధరించండి. ఉద్యోగంలో ఉన్నత హోదా కోసం చేసే ప్రయత్నాలు రికమండేషన్ కలిసొస్తాయి.

### మిథునం

ఈ వారం పనులు ఆలస్యంగా నెరవేరుతాయి కానీ వాటి ద్వారా మీకు ఏ నష్టం వాటిల్లదు. శుభకార్యాలకు సంబంధించిన ఆలోచనలు ముడి పడతాయి. నూతన గృహం కోసం చేసే ప్రయత్నాలు అంతంత మాత్రమే ఉంటాయి. ఓం నమశ్శివాయ వత్తులతో అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. పిల్లల భవిష్యత్తు గురించి ఎంతగానో ఆలోచిస్తారు. తెలిసిన వాళ్ళ ద్వారా ముఖ్యమైన సమాచారాన్ని అందుకోగలుగుతారు.

### కర్కాటకం

ఈ వారం కొత్త కార్యక్రమాలు నూతన ఉత్సాహంతో ప్రారంభించ గలుగుతారు. సంగీత నృత్య కళల పట్ల ఆకర్షితులవుతారు నేర్చుకోవాలని ఆలోచనలు నెరవేరుతాయి. ఉద్యోగరీత్యా సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. హనుమాన్ వత్తులతో అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. కొంతమందితో ఉన్న శత్రుత్వం కారణం చేత కార్యాలయంలో మరింత ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి.

### సింహం

ఈ వారం సహోదర సహోదరీ వర్గం అభిప్రాయ భేదాలు ఏర్పడే అవకాశం ఉన్నది. స్త్రీ సంతానం పట్ల అధిక శ్రద్ధ కనబరుస్తారు. క్రమశిక్షణ లోపిస్తుంది అన్న విషయాన్ని గ్రహించి గట్టి నిర్ణయాలు తీసుకుంటారు. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. కళా సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆకర్షితు లవుతారు మంచి అవకాశాలను అందుకోగలుగుతారు. ప్రముఖులతో పరిచయాలు స్నేహాలకి ఎదుగుతాయి. దూర ప్రయాణాలు అనుకూలిస్తాయి.

### కన్య

దూరపు ప్రయాణం శుభకార్యాల నిమిత్తం చేసే విధంగా ఉంటుంది. మంచి శుభవార్త వినగలుగుతారు. విదేశీ అవకాశాలు ప్రయాణాలు అనుకూలిస్తాయి. కిందిస్థాయి ఉద్యోగస్తులతో సతమతం అవటం వాళ్ళ పనులు చేయకపోవడం మీకు తలనొప్పిగా పరిణమిస్తుంది. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. దైవ కార్యక్రమాలు ఆధ్యాత్మిక చింతన మానసిక సంతోషానికి ధైర్యానికి కారణం అవుతుంది.

### తుల

ఈ వారం రెన్యువల్ కోసం దరఖాస్తు దాఖలు చేస్తారు. విదేశాలలో ఉన్నవారికి సొంత ఇంటి కల నెరవేరుతుంది. విదేశీ అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి . వైద్య విద్య పట్ల మక్కువ చూపిస్తారు. రహస్య మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. వాహన ప్రయాణాలలో భద్రత వహించండి. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. ఎదుటివారి నిర్లక్ష్యం మీకు ప్రమాదానికి కారణం అవ్వచ్చు. అక్కరలేని విందు వినోదాలలో పాల్గొనవద్దు.

### వృశ్చికం

ఈ వారం ఆర్థిక పురోభివృద్ధిని సాధించగలుగుతారు. బహుముఖంగా ప్రజ్ఞాపాటవాలు కనబరుస్తారు. వృత్తి, ఉద్యోగాలపరంగా మీ స్థాయి పెంపొందుతుంది. ఆరోగ్య పరమైన జాగ్రత్తలు అవసరం. ప్రత్యర్థి వర్గం చేస్తున్న కుట్రలను భగ్నం చేయగలుగుతారు. కోర్టు వ్యవహారాలు సానుకూల పడతాయి. రాజకీయ పరిచయాలు లాభిస్తాయి. సరస్వతి దేవి శ్లోకం చదవండి. కష్టమైన కార్యక్రమాలను కూడా క్రమంగా సానుకూల పరచుకోగలుగుతారు. ఉపయుక్తమైన విషయాలు అని భావించిన ప్రతి వ్యవహారాలను ఓర్పు , నేర్పు కనబరుస్తారు.

### ధనస్సు

ఈ వారం చెవి, ముక్కు, గొంతు సంబంధిత ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఋణాలను చాలా వరకు తీరుస్తారు. తనఖా వస్తువులు విడిపిస్తారు. వివాదాస్పద విషయాలకు దూరంగా ఉంటారు. వ్యక్తిగత విషయంలో ఇతరుల జోక్యానికి అడ్డుకట్ట వేస్తారు. నిర్మొహమాటం వైఖరి కనబరుస్తారు. మీడియా వలన బాధపడతారు. మీ ఆలోచనలు కార్యరూపాన్ని సంతరించుకుంటాయి. జిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి ఆటంకాలన్నీ తొలగిపోతాయి. శుభకార్య చర్చలు సానుకూల పడతాయి.

### మకరం

ఈ వారం రక్త సంబంధీకులతో ఏర్పడిన విభేదాలు పరిష్కార బాటలో ఉంటాయి. ఆదాయాన్ని పెంపొందించుకునే అన్ని మార్గాలను సమర్థవంతంగా చేజిక్కించుకుని గలుగుతారు. కారణం లేని చికాకులు వేధిస్తాయి. మానసిక ఉల్లాసానికి ఆధ్యాత్మికత పట్ల మక్కువ చూపుతారు. సౌర కంకణాన్ని ధరించండి ఆరోగ్యం మెరుగు పడుతుంది. అపరిష్కృతంగా ఉన్నటువంటి సమస్యలకు గాను పరిష్కార మార్గాలు లభిస్తాయి. సహోదర, సహోదరీ వర్గంతో విభేదాలు వచ్చే సూచనలున్నాయి.


### కుంభం

ఈ వారం జీవిత భాగస్వామి సలహాలను, సూచనలను ఎక్కువగా పాటిస్తారు. మిత్ర వర్గం వలస లాభపడతారు. జమా ఖర్చులను సరిచూసుకుంటూ. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నరదిష్టి తొలగిపోతుంది. శ్రమ అధికంగా ఉంటుంది. ఫలితాలు అందుకు తగిన విధంగా ఉండవు. అయినప్పటికీ ఉత్సాహవంతంగా కార్యక్రమాలను సానుకూల పరచుకోవడానికి గాను ఓర్పును కనబరుస్తారు.


### మీనం

ఈ వారం కొత్త పరిచయాల ద్వారా పాత సమస్యలే కొత్త కోణంలో తారసపడతాయి. సహనానికి పరీక్షలు ఎదురౌతాయి, ఆర్థిక స్థితి గతులలో చెప్పుకోదగిన ఇబ్బందులేవీ ఏర్పడవు. ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. ప్రజా సంబంధాలను మరింతగా వృద్ధి చేసుకోవడానికి గాను నూతన ప్రక్రియను అవలంబిస్తారు. అరటి నార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. బ్యాంక్ అకౌంట్లను ప్రారంభిస్తారు.


# ఈ వారం 'కార్టూన్స్'



రాఘవా విన్నావా...? ఇతని పని చేసిపెట్టడానికి ఆ మంత్రి పదిలక్షలు లంచం అడిగాడట... మనం వెళ్లి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవాలట...!!
ACB

వాకింగ్ చేస్తూ ఫోటోలు పెడితే.. పట్టుమని పది లైకులు కూడా రావడం లేదు.. వాకింగ్ వల్ల ఏం లాభం డాక్టర్!?
DOCTOR

లక్ష కూడా ఆదాయం లేని మనకేమి 'ఊరట' కూడా!?



మలమల అనే ఈ ఐలాండ్ ఫిజీలో ఉంది. డెస్టినేషన్ వెడ్డింగ్స్ కోరుకునే వాళ్లకి భలే నచ్చుతుంది. సకల హంగులు వున్న ఈ దీవి పర్యాటకుల గమ్యస్థానమని చెప్పవచ్చు.









